
# మిసిమి

మాస పత్రిక

ఫిబ్రవరి-2001



వెల రూ. 8/-



పాబ్లొ పికాసో (1881 - 1973)

## చిత్రకారుని గురించి

పికాసో ఒక నిజమైన చారిత్రక పురుషుడు కాడు, ఒక కల్పిత వ్యక్తి, పురాణ వ్యక్తి ఏమో అనిపిస్తుంది. 20వ శతాబ్దిలో వచ్చిన చిత్ర కళాకారులందరికంటె అత్యంతంగా ప్రసిద్ధమైనవాడు. అంతటి మౌలిక కళాకారుడు మరొకడు కానరాడు. అతడి ప్రేమ జీవితం గందరగోళం, ఘర్షితం, ఆ పైన అది అత్యంత కాముకం. అటువంటి జీవితం అతని కళకు పాదిగా పని చేసింది. ఆడవాళ్ళను అతడు "దేవతలు లేదా కాళ్ళు తుడుచుకొనే పట్టాలు" అనేవాడు. అలా ఆడవాళ్ళను పిలవడం అతనికి అత్యంత మక్కువ. కాని వాళ్ళు అతని కళావేశానికి మూలాలు. అతడు 20 వ శతాబ్ది కళాకారులకు వైతాళికుడయ్యాడు. ఆయన ప్రభావానికి, అకాలంలో, లోబడనివాడు లేడు.

అతని పరిశోధక మేధ అనేక రకాల శైలులను, మాధ్యమాలను అనుసరించింది. కాని అతడు కళామతల్లికి చేసిన దోహదాలలో కెల్ల 'ఘనవాదం' (Cubism) అత్యంత ముఖ్యమైంది. 1945 ల తరవాత అతని ప్రత్యక్ష ప్రభావం సన్నగిల్లినప్పటికి, 1956లు, 1960లలో గూడ అతడు, తనలోని ఒక అంతర్గత పీడనం తోసుకు వచ్చినట్లుగా, బొమ్మలు చిత్రిస్తూనే ఉన్నాడు. అతడు తన 91వ యేట మరణించినాక గూడ అతని కీర్తి ప్రతిష్ఠలు తిరుగులేకుండా కొనసాగాయి.

1895లో పికాసో కుటుంబం బార్సిలోనా వెళ్ళింది. అక్కడతనికి మేధావులు, రచయితలు, పాత్రికేయులు, కళాకారులు తారసపడ్డారు. అక్కడ కేఫ్‌లలో రాత్రిళ్ళు తాత్విక చర్చలు ముగిసినాక, వేశ్యల కొంపలకు వెళ్ళేవాడు. 1900 లలో పారిస్ వచ్చాడు. మాక్స్ జాకబ్ అనే పాత్రికేయుడు అతనికి మిత్రుడయ్యాడు. ఇద్దరికీ ఒకటే మంచం. అతడు ఆ మంచం మీద రాత్రి పడుకొంటే, పికాసో పగలు పడుకొనేవాడు. కటిక దరిద్రం, చలి కాచుకోవడానికి పికాసో పెయింటింగ్స్ ఎన్నో అగ్నికాహుతి అయ్యాయి.

అతడి మౌలికశైలి (1901 - 1905) అంటరానివారిని, పరాయితనాన్ని, పేదరికాన్ని, నిస్పృహను చిత్రించడంలో బయట పడింది. అతని జీవితంలోకి మొదటిగ ప్రవేశించిన మార్సెల్ హంబర్ట్ (అతడు ఆమెను 'ఇవా' అన్నాడు). ఘనవాద చిత్ర శైలికి కావలసిన సృజనాత్మక శక్తిని అతని నుంచి వెలువరించ గలిగింది. కాని ఆమెతోడి సంబంధం కొద్ది కాలంలోనే అంతరించింది.

మేరీ థెరెసాను ఒకనాడతడు వీధిలో చూశాడు, "నీ ముఖం ఆసక్తికరంగా ఉంది" నీ చిత్రం నేను వేస్తాను అన్నాడు. ఆమె అతనికి ఉంపుడు గత్తెగా, మోడల్‌గా పని చేసింది.

అతడి సారవంతమైన ఊహాశక్తి, అసాధారణ సహజ సామర్థ్యం, అనంతమైన వైవిధ్య నైపుణ్యంలో అభివ్యక్తీకరణలో నూతనతలకు దారి తీశాయి. ఈ నూతన పద్ధతులు ఆధునిక కళాగతిని మార్చి, మార్గ నిర్దేశం చేశాయి.

## ముఖచిత్రం : గుయేర్నికా (1937)

"కళారూపాలు వర్ణనాత్మకంగానే ఉండనవసరం లేదు" అనే భావనను ఘనవాదం ప్రపంచానికి కనువిప్పు కలిగించింది.

గుయేర్నికా, వర్ణనాత్మక అభివ్యక్తీకరణ కంటె ఎంత ఎక్కువగా అభివ్యక్తిని ప్రదర్శించగలదో నిరూపించింది. హింసాత్మక సంఘటనలు సంభవిస్తున్నాయి. కాని దారుణంగా కొనతేలిన, మొనతేలిన, అడ్డదిడ్డరేఖలు సృష్టించే భీతిని గందరగోళాన్ని చూడాలి. 1937 ఏప్రిల్‌లో ఫ్రాంకో జర్మన్ మిత్ర పక్షాలు పురాతన గుయేర్నికా రాజధాని బాస్క్‌ని బాంబులతో నేల మట్టం చేసిన ఒక ప్రత్యేక సంఘటనకు పికాసో ప్రతిస్పందన ఈ చిత్రం. కాని దీని ఫలితం ఏమిటంటే, ఒక మనిషి మరో మనిషి మీద ఎంత అమానుషంగా ఉండగలడో ఒక సాధారణ రూపంలో చూపిస్తుంది ఈ చిత్రం. కొంతమేరకది ఎద్దుల కుమ్ములాట, కొంతవరకు అమాయకుల ఊచకోత.

# మిసిమి

**"All that we are is the product of what we have thought" is "We are what we think." - Dammapada.**

సంపుటి 13 ఫిబ్రవరి 2001 సంచిక 2

వ్యవస్థాపక సంపాదకుడు : **డాక్టర్ రవీంద్రనాథ్ ఆలపాటి**

## విషయ సూచిక

మనీషి నాకేంద్ర బిందువు - ఆచార్య ఎన్. గోపి

సృజనాత్మకత మర్మం ఏమిటి ? - అన్నపరెడ్డి వెంకటేశ్వర రెడ్డి

చైనా నవల - డా॥ యు. ఏ. నరసింహమూర్తి

పురాణం 'మధురవాణి అవతార' వృత్తాంతం - మద్దాలి సత్యనారాయణ శర్మ

రత్నాలు, వజ్రాలు – సైన్సు చెప్పే వాస్తవం - సి. వి. సర్వేశ్వర శర్మ

ఇంద్రియాతీత శక్తులు - ఎన్. ఇన్నయ్య

విడిప్రతి రూ. 8/- వార్షిక చందా రూ. 100/- విదేశీయులకు $20

ముఖచిత్రం : **గుయెర్నికా**

Printed & Published by BAPANNA ALAPATI at Kala Jyothi Process Ltd., 1-1-60/5, R.T.C. X Roads, Musheerabad, Hyd - 20. Ph. 7645536
E-mail : misimi_m@hotmail.com

సంపాదకుడు : **అన్నపరెడ్డి వెంకటేశ్వర రెడ్డి**

## మిసిమి వ్యవస్థాపక సంపాదకుడు
## డాక్టర్ ఆలపాటి రవీంద్రనాథ్

మరణం: ఫిబ్రవరి 11, 1996

మనిషి ఎదుగుతాడు. కాని మరణంలోకి ఎదుగుతాడు

జననం: నవంబరు 4, 1922

# మనీషి నా కేంద్ర బిందువు

- ఆచార్య ఎన్. గోపి

కవిత్వం నాకు అనివార్యతా గుణం. స్పాంటేనియస్‌గా ఎక్కడో తీగ తెగడం దాని లక్షణం. కవిత్వం మొహం చాటేసినప్పుడు నేను విలవిల్లాడిపోతాను. నేను దర్శించిన మనిషి నా కవిత్వానికి కేంద్ర బిందువు.

**(I quote)** ''ముట్టుకుంటే తగలాలి కవిత్వం
మనిషిలాగా.
నరాల్లో ప్రవహించే రక్తపుష్పాలు
వెచ్చగా తాకి పోవాలి.''

ఉధృతంగా ఉద్యమాలు వస్తున్న కాలంలో అన్ని ఉద్యమాలను జీర్ణించుకుని పరిణామశీలంతో ప్రత్యేకంగా ఎదిగిన కవిని నేను. ఒకరకంగా సమన్వయి నా కవిత్వం. సమన్వయం నుంచి పుట్టిన జీవ సారంలోంచి లేచి నా మనిషి నిలబడ్డాడు. ఈ మనిషి ఆధిపత్య భావాలను వ్యతిరేకించినవాడు. దేశీయతలోంచి విశ్వజనీనతకు ఎదిగినవాడు. అమానవీయతపై అంతులేని యుద్ధం ప్రకటించినవాడు. వ్యాపార సంస్కృతిలో మనిషికి వాటిల్లే ముప్పును గమనించి హెచ్చరించినవాడు. కవిత్వాన్ని అంతర్బహిర్ యుద్ధారావంగా అర్థం చేసుకున్నవాడు. లోపలికీ బయటికీ వెళ్తూ వస్తూ సమన్వయాన్ని సాధించింది నా కవిత్వం. ఏ ముద్రాలేని నాకు ప్రగతిశీల మానవీయ కవి అని ముద్రవేస్తే అభ్యంతరం లేదు. సమన్వయవాద కవి అంటే నొచ్చుకోను.

కవిత్వం నాకొక బాధామయ రసాయనిక ప్రక్రియ. బాధ ఎందుకంటే సంక్లిష్టమైన మానవ ప్రవర్తనలోకి దిగి ఈదులాడి బయటపడాలి కాబట్టి. కవిత్వం నాకొక జల్లెడ, ఒక వడబోత, ఒక వస్త్రగాళం, **(I quote)** ''అనుభవాల మహత్తర చిత్రవర్ణాలకు గురయ్యే లిట్మస్ కాగితం నా కవిత్వం.'' అందుకే అక్షరాలకు సంకెళ్లను నేను సహించను. కవిత్వంలో పోటీతత్వం నాకిష్టముండదు. కవిత్వం నాకు బడాయి కాదు. ప్రతి కవితా తన అనుభవాలను పూర్తిగా చెప్పలేక ఓడిపోతున్నదన్న వినమ్ర భావం నాది. **(I quote)** ''అనుభవాలను వ్యక్తం చేసే పెనుగులాటలో / ఓడిపోయిన రక్తం గుర్తులు నా కవితలు'' అందుకనే ప్రతి కవితనూ మళ్లీ కొత్తగా రాసే ప్రవేశ పరీక్షగా భావిస్తాను. జీవితమంతా ఏ పద్యంలోనూ పట్టదు. నేను రాయవలసిన పద్యం కోసం జీవితాంతం తపస్సు చేయవలిసే ఉంది. అంతవరకూ ఈ పెనుగులాట కొనసాగుతూనే ఉంటుంది. నేను ప్రయాణం కవిని. ప్రయాణంలో శకలాలుగా చెదిరిపోయిన నేను నాలోకి చేరుకుంటాను. ప్రయాణంలో నేను నిలువెల్లా కవినై పోతాను. మనిషిగా మారుతాను.

---

ఆచార్య ఎన్. గోపి, హైదరాబాదు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయానికి వైస్ ఛాన్సలర్.

(I quote) ''ఎన్ని నగిషీలు చెక్కినా చెక్కకు అడవిగుణం పోదు
నా పద్యాలే నన్ను మనిషిగా మనిషిగా మనిషిగా మలుస్తాయి.''
''ఎన్ని మంత్రతంత్రాలు చేసినా
నా పద్యాలకు పొగరే ఎక్కదు.
కాస్త బిడియం.. భయం వాటిజాతకం - లోనే లేదు.''

బిడియం నా సామాజిక నేపథ్యంలోంచి వచ్చింది. సాహసం కూడా అక్కడే ఆవిర్భవించింది. సాహసం నా సత్యాన్వేషణలో దొరికిన వుుత్యమైతే, బిడియం నా వాస్తవికత. ఈ తత్త్వమే నా కవిత్వంలో హిపోక్రసీ లేని తనాన్ని ప్రకాశింపజేసింది. ఏది చెప్పినా, ఎలా చెప్పినా నిజాయితీ ముఖ్యం అనేది నా నమ్మకం.

నేను కవిని కావడం ఒక చారిత్రక యాదృచ్ఛిక సంఘటన **(Historical Accident).** దాదాపు నిరక్షరాస్యుల కుటుంబంలో పుట్టాను. నా కుటుంబంలో తొలితరం విద్యావంతుడిని నేను. అతి పిన్నవయసులో లభించిన విపరీతమైన గ్రంథ పఠనావకాశం నాకో వరమైంది. చిన్నప్పటి

**నా కవి**

కాలాన్ని నిద్ర పోనివ్వక జీవించిన గోపీకి, తెలుగు కవితాకా
''క్షితిజ రేఖమీద చెవినానించి'' కాలాతీతగొంతుకల సవ్వడి విన్న గ
భూగర్భ సారం నుంచి చెమట బిందువులు మోసుకొచ్చిన ఆకలి స్త
రొట్టెను ఆరగిద్దామన్న గోపీకి , కాలాతీత కాల పత్రం మీద క
సిరాతో లేఖించి మనిషి బొమ్మను గీసినగోపీకి, బతికి ఉన్న మనం ని
బ్రతికి ఉన్నామా చచ్చి ఉన్నామా అన్న ప్రహేళికను లేవనెత్తి మ
నిలదీసిన గోపీకి, సంప్రదాయ సంస్కృతంలో పొదిగిన విలు
వేమన్నను తలక్రిందులుగా నిలబెడితే, మళ్ళీ ఆయన్ను సరిగా నిల
గోపీకి, ప్రపంచ సాగర జలాల కంటె మనిషి కార్చిన కన్నీరే ఎక్కు
బుద్ధుడంటే, 'అసలు ఈ భూగోళమే ఒక కన్నీటి బిందువు'గా కనిపి
గోపీకి ఇటీవల కేంద్ర సాహిత్య అకాడెమీ పురస్కారాన్ని ఇచ్చి, త
తాను గౌరవించుకొంది. తద్వారా దేశమే తననం త
సమ్మానించుకొంది. సన్మానించుకొంది. ఆయన్ను పురస్కరిం
''కాలాన్ని నిద్రపోనివ్వను'' అనే ఆయన కవితా సంపుటికి.

ఆయనవి మొత్తం ఏడు కవితా సంపుటాలు - తంగేడు పు
(1976), మైలురాయి (1982), చిత్రదీపాలు (1989), వ
(1993), కాలాన్ని నిద్రపోనివ్వను (1998, 2001), నానీలు (19
చుట్టకుదురు (2000) - పదకొండు విమర్శక, పరిశోధక గ్రంథా

ఉపాధ్యాయులు, మంచి స్నేహితులు నా కవితా వ్యక్తిత్వాన్ని మలిచారు. అందుకే నా కవిత్వంలో నాస్టాల్జియా కాస్త ఎక్కువగానే ఉంటుంది. నాస్టాల్జియా బలహీనత కాదనీ తరాల మధ్య వంతెన అని భావిస్తాను. కాబట్టి నా కవిత్వం క్యాలెండర్లకు అతీతమైంది కాదు. పరిణామానికి బాహ్యమైందీ కాదు.

నేను స్వాప్నిక కవిని కాదు. నా మట్టిలో పూచిన పువ్వులు నా కలలు. మట్టివాసన నా కవిత్వంలో ప్రధాన గుణం. నీళ్లు లేని మెట్టప్రాంతంలో పుట్టడం వల్ల రాతిగుట్టలే నా నేస్తాలు. వాటిలో నేను నదుల్ని దర్శించాను. కన్నీటి స్రవంతుల్ని అనుభవించాను. నేను వచ్చిన ఆంధ్రప్రదేశ్‌లోని దక్షిణ తెలంగాణా ప్రాంతం కొండలపైన తన కన్నీటి వస్త్రాల్ని ఆరేసుకుంటుంది. ఈ కారణం వల్లనే నా వేళ్లన్నీ మా ఊళ్లోనే ఉన్నాయి. ఒక రకంగా ప్రతి కవి కవిత్వం అతని ఎమోషనల్ ఆటో బయోగ్రఫీ అయినట్లే నా కవిత్వం కూడా ఒక వ్యక్తిగత, సామాజిక సమ్మళిత ప్రక్రియగా మారినట్టుగా నాకు తోస్తుంది. నన్నూ నా కవితా జీవితాన్నీ ప్రభావితం చేసిన వారిలో గొప్ప సాహిత్యకారులే కాకుండా సామాన్యులు కూడా ఉన్నారు. సోకాల్డ్ నిరక్షరాస్యుల రూపంలో ఉన్న మేధావులు కూడా నన్ను ప్రభావితం చేశారు. ఒక గొప్ప గ్రంథంలో ఉన్న సూక్తుల్ని సామాన్యులన బడేవారు వంట్టిలోంచి సహజంగా ఎగరేయడం చూశాను.

నేను తెలంగాణా ప్రాంతంలో నల్లగొండ జిల్లాలోని భువనగిరిలో 50 యేళ్ల క్రితం పుట్టాను. నేను పుట్టినప్పుడు అది పెద్ద గ్రామం. ఇప్పుడు పెద్ద పట్టణం. ఆ మార్పులు కూడా నా కవిత్వంలో ప్రతి ఫలించకుండా ఎలా వుంటాయి. ఎకడమిక్‌గా నేను బుద్ధిమంతుడైన విద్యార్థిని. ఎకడమిక్‌గా నేను పట్టుదలతో పౌరుషంతో సాధించిన విజయాలన్నీ నన్ను వైస్ - ఛాన్స్‌లర్ పదవిదాకా తీసుకొచ్చినా, అవి నాకు సంతోషాన్నే కలిగించాయి కాని నా లోలోపలి తుఫానుల ప్రకోపాన్ని మాత్రం

**ఆటోగ్రాఫ్**

...న్న వాదం (1979), ప్రజా కవి వేమన (1980), జ్ఞాన దేవుడు ...నువాదం 1983), భిన్నత్వంలో ఏకత్వం (1986), వ్యాసనవమి ...87), వేమన పద్యాలు (సముద్ధరణ 1990), (పారిస్ ప్రతి క్రీ.శ. ...0), నిలువెత్తు సంతకం సినారె వ్యక్తిత్వం (వ్యాస సంపుటి 1991), ...క్షం (వ్యాస సంపుటి 1991), నేను చూసిన మారిషస్ యాత్రా ...త (1996), సాలోచన (గోపీ పీఠికలు) వ్రాశారు.

ఆయన అధ్యాపకుడుగా ఉన్నా, పొట్టి శ్రీరాములు తెలుగు విద్యాలయానికి వైస్ ఛాన్స్‌లర్ అయినా మానవ సంబంధాలను ...వలేదు. మానుష సంబంధాల గాఢతకు ఆయన దూరుడు కాలేదు. ...న గర్భ కుహరంలో మనకు కనిపించేది మానుషత, మానవత, ...నవీయత. ఇదే ఆయన గీసిన గీతలకు రాసిన రాతలకు ఆధార ...ము.

ఇటీవల ఆయన 'వార్త'కిచ్చిన ఇంటర్వ్యూలో ''నేను స్థూలంగా' ...పక్షానికి చెందినవాడ నని'' చెప్పుకొన్నా ఆయనకు దక్షిణ, వామ ...లు రెండు లేవు. ఉన్నది ఒకటే పక్షం - అది మానుష పక్షం.

కేంద్ర సాహిత్య అకాడెమీ పురస్కారించిన సందర్భంగా ఆయనకు ...సిమి' శుభాకాంక్షలు తెలియజేస్తోంది.

\- సంపాదకుడు

కవిత్వమే చేయి పెట్టి ఆపగలిగింది. నా అకడమిక్ పదవులు నా కవిత్వానికి అడ్డు రాలేదు. కవిత్వం వాటిని మనిషిలా నిర్వహించేందుకు తోడ్పడింది.

పరిశోధకుడిగా కూడా నాకు పేరుంది. వేమన అనే కవిపై నేను పరిశోధన చేశాను. అతను కబీరులాంటి వాడు. ఆ గ్రంథం మూడు ముద్రణలు పొంది తెలుగునాట నిత్య పారాయణ గ్రంథంగా ఉంది. రాశిలో నా కవిత్వం కంటే పరిశోధనా, విమర్శన వ్యాసంగమే ఎక్కువగా చేశాను. విచిత్రంగా కవిత్వం, పరిశోధనా నాకు విరుద్ధాంశాలు కాలేదు. ఒక శ్రామికుడూ, ఒక మానవ ప్రేమికుడూ హాయిగా కలిసిపోయారన్నమాట!

నేను 12వ యేట కవిత్వాన్ని ప్రారంభించాను. గణబద్ధమైన పద్యాలు రాశాను. లయాత్మకమైన గేయాలు రాశాను. వచన కవిత్వంలో అడుగుపెట్టి మళ్లీ వెనక్కి తిరిగి చూడలేదు. తెలుగు మహాకవి డా. సి. నారాయణరెడ్డి నన్ను బాల్యంలో ప్రోత్సహించారు. ప్రాచీన కవిత్వాన్ని డొక్కశుద్ధిగా చదువుకున్న నేను అందరికీ అర్థం కావాలనే సరళ శైలిపైనే ఎక్కువగా దృష్టి సారించాను. అందుకే నేను వస్తువుపైనే కాకుండా చెప్పే పద్ధతిపైన కూడా శిల్ప శ్రద్ధ వహిస్తాను. కాబట్టి నా శైలి అందరికీ నచ్చుతుంది.

నేను ఇటీవల 'నానీలు' (Epigrams) అనే ప్రయోగం చేశాను. హైకూల పేరు ఆకర్షణకే లోబడి రాస్తున్న స్థాయిని చూసి ఒక దేశీయ ప్రక్రియను సృష్టించాను. అది ఈనాడు ఒక Trend Setter గా మారింది.

ఇక ''కాలాన్ని నిద్రపోనివ్వను'' గురించి. ఇది నా ఐదో కవితా సంపుటి. నేను మొత్తం ఏడు కవితా సంపుటాలు ప్రకటించాను. ''కాలాన్ని నిద్రపోనివ్వను'' కాలాన్ని గురించిన పలు పార్శ్వాలుగా ప్రతిఫలించిన ఆర్తీ, వేదనా, వివేచనా ఉన్నాయి. ఈ కవితలు ఒక Trans లో నేను రాశానని అనుకుంటున్నాను. ఈ సంపుటికి ముందు మా 17 ఏళ్ల కూతురు మరణం సంభవించింది. నేను పాతాళంలోకి పడిపోయి మళ్లీ భూమిపైకి ఎగబాకి, పాకుతూ కాలాన్ని ప్రశ్నిస్తూ రాసిన కవితలు ఇందులో కొన్ని వున్నాయి. వ్యక్తిగత దుఃఖం సాధారణీకరణమవుతూ విశ్వదుఃఖానికి చేరువౌతున్న దృశ్యాలు దీనిలో కన్పిస్తాయి. ఈ సంపుటి నన్ను మనిషికి మరింత సన్నిహితం చేసింది.

గతంలోంచి ఫలాలు తీసుకున్నాను. వర్తమానంలో వెలుగుతున్నాను. భవిష్యత్తులోకి బీజాల్ని చల్లుతున్నాను. ఈ అవార్డు గాయాలతో పచ్చిగా ఉన్న నా మనస్సుకు చందనం రాసినట్టుగా వుంది. ఇది నా కవితా జీవితంలో ఒక మజిలీ మాత్రమే. భవిష్యత్తులోని నిత్య సత్యాన్వేషణకు ఇది ఒక పాథేయంగా మారుతుందని భావిస్తున్నాను. దీనికి కారణమైన వారందరికీ కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను.

# సృజనాత్మకత మర్మం ఏమిటి ?

- అన్నపరెడ్డి వెంకటేశ్వర రెడ్డి

సృజనాత్మక శక్తి దేవుడిచ్చిన వరం అంటూ ఉంటారు చాలమంది. పెంపకంతో పిల్లలను మనకు కావలసిన రీతిలో మలచుకోవచ్చంటాడు జె. బి. వాట్సన్ అనే ప్రవర్తన వాద మనో విజ్ఞాన శాస్త్రవేత్త. అలా కాదు, మనిషి తయారవడంలో జన్యు పరమైన వారసత్వ అంశం ప్రధానమంటాడు గాల్టన్. ఏది ఏమైన శిక్షణతో కొంతమేర సృజనాత్మక శక్తిని పెంచవచ్చును అంటున్నారు ఆధునిక మనోవిజ్ఞాన శాస్త్రవేత్తలు. అది ఒక మార్మికత అంటున్నారు మరికొందరు.

రచయిత, కవి, చిత్రకారుడు, సంగీతకారుడు మొదలైన వారిని మనం సృజన కర్తలంటాం. కాని శాస్త్రజ్ఞుడు, వడ్రంగి, కులాలుడు, పిల్లలను పెంచే తల్లి, వ్యవసాయదారుడు కూడ సృజనకారులే అనే విషయం మనం విస్మరించరాదు. సృజనకారులు అసలు ఏమి చేస్తారు? ఆత్మాభివ్యక్తీకరణం గావించుకొంటారు. ఆత్మాభి వ్యక్తీకరణం అంటే **Self Expression** కళ, కవిత్వం, వడ్రంగం విజ్ఞానశాస్త్ర సూత్రాలు. సృజనాత్మక ఆలోచనాపరుడు - అతడు విజ్ఞాన శాస్త్రవేత్తగాని, కళాకారుడు గాని ఏదో కొత్త దాన్ని ఉనికిలోకి తేవాలని ప్రయత్నిస్తుంటాడు. ఒక భావాన్ని నూతన పద్ధతిలో ఆహ్లాదం కొలిపే ఆకృతుల సంయోగంలో, రంగులలో లేదా పద ధ్వనులలో వ్యక్తీకరిస్తాడు.

సృజనాత్మక క్రియలో ఏమి జరుగుతుంది! భావాలు బుడగలు బుడగలుగా, అయత్నంగా వస్తున్నట్లు కనిపిస్తాయి. అచేతనంలో ప్రతీకలు అనేక రకాల సంయోగాలు చెంది చేతనం ఉపరితలానికి వస్తున్నట్లు కనిపిస్తాయి. కొంత కాలంగా అచేతనంలో అంతర్మథనం జరిగి, ఆభావాలు చేతనంలోకి దూసుకువచ్చి చేతనాన్ని ముంచి ఉక్కిరి బిక్కిరి చేస్తాయంటాడు ఆర్థర్ కోజ్లర్ తన **Act of creation** అనే గ్రంథంలో. అలా ముంచెత్తిన వేదనని అభివ్యక్తం చేయడమే కవిత్వం, కళ.

ఈ సృజనాత్మక ప్రక్రియలో ఐదు దశలున్నట్లు మనో విజ్ఞాన శాస్త్రవేత్తలు, చాలామంది సృజనశీలురను అధ్యయనం చేసిన తరవాత గుర్తించారు. అవి: 1) తయారు 2) పొదుగుడు 3) ప్రదీప్తం 4) మూల్యాంకనం, 5) పునర్విమర్శ. ఒకటవదైన 'తయారు' దశలో సమస్యను గుర్తించి దానిని పరిష్కరించడానికి అవసరమైన విషయాన్ని సేకరించడం జరుగుతుంది. రెండోదైన 'పొదుగుడు' కాలంతో అంతర్మథనం జరిగి పరిష్కారాన్ని అడ్డుకొనే విషయాలు అంతరించి పోతాయి. ఈ దశలో అచేతన ప్రక్రియ ఎక్కువగా ఉంటుంది. మూడోదైన ప్రదీప్త దశలో 'ఓహ్' ! అనుభవం కలుగుతుంది. సమస్యా పరిష్కారానికి ఆకస్మికంగా ఒక భావం ఉత్పతిల్లుతుంది. నాలుగో దశ 'మూల్యాంకనం' లో 'ఓహ్' అనుభవానికి సంబంధించిన ప్రజ్ఞ సరైనదో కాదో విలువ కట్టబడుతుంది. హఠాత్తుగా మనస్సులోకి వచ్చిన 'ఓహ్' అనుభవాలు అన్నీ సరైనవనడానికి వీలులేదు. ఐదో దశలో ఒకసారి విషయాన్నంతా పునర్విమర్శించుకొంటాడు. ( ఇంతవరకు వర్ణించిన సృజనాత్మక ప్రక్రియ వర్ణన అంత సంతృప్తి కరమైంది కాదు. భవిష్యత్తులో సైకాలజీ దీనిని గురించి పరిశోధనలు జరిపి ఇంకా ఎక్కువ

సమాచారాన్ని అందిస్తుందని ఆశిద్దాం). అసలు సృజనాత్మక ఎక్కడ ఉంది? నిరాకారం లోంచి ఆకారాన్ని సృష్టించడంలో ఉంది. మామూలుగా వేరు వేరని, అసదృశాలని భావించబడిన అంశాలను వినూత్న రూపంలో పొందుపరచడంలో ఉంది. ఎవడైనా చెబితే కాకుండ, తనకై తాను, తన అంతర్గత పీడనంతో నూతన దిశలలోకి పయనించడంలో ఉంది. చాలామందికి అది దూరంగా జరిగే అజ్ఞాత, అన్వేషిత, అనిశ్చిత, అపరిశీలత విషయాలలో మునకలు వేయడంలో ఉంది.

మరి ఈ సృజనకర్తలు దేనిని కోరుతున్నారు? దేనిని అన్వేషిస్తున్నారు? వారు అందాలను సృష్టించాలని ప్రయత్నిస్తున్నారా? సమతూకాన్నా? లయనా? పేరు ప్రఖ్యాతులనా? వీటిలో ఏదీ కాదు. వారి లక్ష్యం ఇంతకు ముందే చెప్పినట్లు, తమను తాము ఆవిష్కరించుకోవడం, తమను తాము ఎరగడం, తమను తాము అభివ్యక్తం చేసుకోవడం. తమ పరంగా సత్యాన్ని అన్వేషించడం తమను గురించిన ఎరుక కోసం ఉండే ఆర్తిని తీర్చుకోవడం. అటువంటి సృజనాత్మకత ఏమిటి? సృజనాత్మకత స్వేచ్ఛతో ఆరంభమవుతుంది. మరో విధంగా చెప్పాలంటే సృజనాత్మక క్రియ సారం స్వేచ్ఛ, సృష్టించడం. అంటే ఒక సంభావ్యతను వెదికి పట్టుకొని దానిని వాస్తవం చేయడం, ఒక సంభావ్యత వాస్తవమవుతుంది. సృజన సామర్థ్యం ప్రతివాని మనస్సులోను ఉంటుంది. రాయిమీద రాయిపెట్టి ఆకాశహర్మ్యం కట్టే టాపీ వాని నుంచి కుటుంబాన్ని ఏర్పాటు చేసుకొనే గృహస్థు వరకూ మానవ ప్రపంచంలో అన్ని క్రియలలోను ఇది అంతర్గతంగా ఉంటుంది.

స్వేచ్ఛ, సృజనాత్మకతలను మనం పర్యాయ పదాలుగా వాడుతూ ఉంటాం. అవి అతుక్కొని పుట్టిన కవల పిల్లలు- స్వేచ్ఛా సృజనాత్మకత లేదా స్వేచ్ఛగా ఉండడం, సృజనాత్మకంగా ఉండడం. ''స్వేచ్ఛగా ఉన్నవాడు మాత్రమే సృష్టిస్తాడు'' అంటాడు తన "The Meaning of Creative Mind" అనే గ్రంథంలో నికలస్ బెర్డియేవ్. అంటే అతడి ఉద్దేశంలో 'స్వేచ్ఛ' అంటే మనం మామూలుగా అనుకొనే స్వేచ్ఛ కాక అంతర్గత స్వేచ్ఛ **(Inner Freedom)**. అంతర్గత స్వేచ్ఛ ఊహా స్వేచ్ఛ **(Freedom of Imagination)** సంభావ్యమైన దానిని భావన చేసే స్వేచ్ఛ **(to conceive of the possible)** సంభావ్యతను అనుభవంలోకి తెచ్చుకోవడానికి, మనచుట్టూ ఉన్న ప్రపంచంలో బీజరూప శక్తిని చూడడానికి అటువంటి అంతర్గత స్వేచ్ఛ ఉండాలి.

స్వేచ్ఛ అనేది కళాకారునికే కాదు శాస్త్రజ్ఞునికి గూడ జీవన సారమే. నీల్స్‌బోర్ అనే అణు శాస్త్రవేత్త ఒక మాట చెప్పాడు: ''నాకు సిద్ధాంతాలు ఎంత పిచ్చి పిచ్చిగా అసంబద్ధంగా కనిపిస్తే వాటిని నేను అంత ఆదరిస్తాను. ఎదుకంటే ఆధునిక భౌతిక విజ్ఞాన శాస్త్ర సిద్ధాంతాల్లో వెర్రితనం **Craziness** ఎంత ఎక్కువగా ఉంటే అవి అంత ఎక్కువగా నిజాలయ్యే అవకాశం ఉంది. ఇలా చెప్పడంలో అతడు మనం అనుకొనే 'అంతర్గత స్వేచ్ఛ' 'అతిరూపాన్ని' **extreme form** ను ప్రదర్శిస్తున్నాడని దీని అర్థం. అంతే కాని ప్రయోగాలు జరిపే బాధ్యత నుంచి భౌతిక విజ్ఞాన శాస్త్రాన్ని తప్పిస్తున్నామని కాదు''.

అతడే ఇలా అన్నాడు: నేను ఇది రాసేటప్పుడు నా పెయింటింగ్ పరికరాలు తీసుకొని దగ్గరనే ఉన్న సముద్రతీరానికి నన్ను నేను పునఃసృష్టించుకోవడానికి **re-create** చేసుకోవడానికి మనం వినోదం

recreation అనే పదం ఉపయోగించినప్పటి వలె వెళ్ళాను. అప్పుడు నాకనిపించింది: సముద్రపు టొడ్డున నేను పెయింటింగ్ చేస్తున్నంత సేపు నా మనస్సులో ఏమి జరిగిందో వివరిస్తే, ఈ సృజనాత్మక ప్రక్రియను అర్థం చేసుకోవడానికి కొంతవరకు దోహదపడుతుందేమోనని: ''ఆ సముద్రపుటొడ్డున నేను నడిచాను, తెరిచిన మనస్సుతో, సంసిద్ధతితో, ఏదైన నన్ను ఆకట్టుకొనే దృశ్యం తగులుతుందేమోనని. అలాగే మరికొంత నడిచాను, ఒక విశిష్ట వేదనతో, ఒక ప్రత్యేక దృశ్యం నన్ను పైకొనేదాక. నేను దానిని చూశాను. కాని నాకాసమయంలో నేను దానిని దర్శిస్తున్నాననే స్పృహ లేదు. అంతకుముందెన్నడూ, ఎవరూ చూడని రీతిలో దానిని నేను చూశాను.

''నేను కుంచెను కాన్వాసుపై తాడించేటప్పుడు, నేను విగళితుడనయ్యాను. బిగుసుకుపోలేదు. గడ్డకట్టుకుపోలేదు. నన్ను నేను ఆదృశ్యానికి అర్పించుకొన్నాను. సముద్రపుటొడ్డున ఆ రాతి ఆకృతిని, ఆరాతి నేపథ్యాన్ని చూశాను... నేను అందులో కూరుకుపోయాను. మునకలు వేశాను. తాత్కాలికంగా నేనొక నూతన ప్రపంచ వాసినయ్యాను. అందులో అవశ్యక హర్షాతిరేకం ఏమీ లేదు. ఒక ప్రశాంత హర్షాతిరేకం మాత్రం ఉంది... నేను పెయింట్ చేసినంతసేపు అందులో ఉండిపోయాను. ఎక్కువ కాలం ఒక రకం ప్రాక్ చేతన **Preconscious** స్థితిలో, ఆలోచనారహిత స్థితిలో గడిచి పోయింది. కాని, దాని అనుభవం దక్కింది. మరెప్పుడైనా, ఎవడైనా ఇక్కడ ఏమి చేస్తాడు. సంవత్సరాల క్రితం అక్కడ నాగురువులు నాకేమి బోధించారు? లాంటి ఆలోచనలను నేను నెమరు వేసుకొంటే, నా ఈ 'దర్శనం' మాత్రమే రాగల ఆ ప్రత్యేక అనుభూతి నాకు దక్కేది కాదు.

''అందుకని సృజనాత్మకతలో అధిక భాగం యాదృచ్ఛికం, కాని కళాకారుడనేవాడు - అతడు శాస్త్రపరిశోధకుడైనా, చిత్రకారుడైనా, రచయిత అయినా, ఎవరైనా - ఆయాదృచ్ఛికత **accident** కోసం ఎదురు చూడాలి. తనను తాను వివృతంగా, సిద్ధంగా ఉంచుకోవాలి. కళాకారుడు ఆ అదృష్ట యాదృచ్ఛికత కోసం కన్నులు తెరచుకొని వేచి చూస్తాడు. యాదృచ్ఛికత అనేది సరైన పదం కాదు. అనేకానేక వైవిధ్య సంభావ్యతలు. వీటిల్లో ఏదో ఒకటి వాస్తవ రూపం దాలుస్తుంది, జనిస్తుంది.

ఈ చిన్ని వివరణలో - అనేక సూత్రాలు ఇమిడి ఉన్నాయి: సృజించాలనుకొనే వాడిలో ముందుగా వివృతత్వం **(Openness)** సంసిద్ధతలు ఉంటాయి. రెండోది బాహ్య దృశ్యం, అతనిని పైకొని, అతని అంతరంగ దర్శనంతో పెనవేసుకుపోతుంది. దానికి సంబంధించి మనలో ఏర్పడిన ముద్ర, బాహ్య దృశ్యాల మధ్య ఉన్న వేరుతనాన్ని అధిగమిస్తూ, ఆత్మగత, వస్తుగత ప్రపంచాల సమ్మిశ్రణంతో సృష్టి జరుగుతుంది. మూడోది అంత తీవ్రం కాని, ఒక రకంగా అందమైన హర్షాతిరేకం **(ecstacy)** ఉంటుంది. సృష్టించినంత సేపూ కళాకారుడు ఈ స్థితిలోనే ఉంటాడు. నాలుగోది సృష్టి ఫలితాన్ని - అది చిత్రం గాని మరేదైనా గాని - ముందుగా పసికట్టలేక పోవడం ఉంటుంది. ఐదోది ఈ సృష్టి క్రియలో ఒక రకమైన మార్మికత **(mystery)** ఉంటుంది. సృజనాత్మక వ్యక్తి ఎవరంటే తనను తాను ఆ 'యాదృచ్ఛికత'కు సంసిద్ధంగా ఉంచుకొన్నవాడు. ఇంకా అంతకంటె బాగా చెప్పాలంటే, 'సృజనాత్మక ప్రక్రియా మార్మికతకు', వివృతమై ఉన్నవాడు.

సృష్టిక్రియను గురించి మనకు తెలిసే కొలది, దానిమీద మన ఆసక్తి పెరుగుతుందే తప్ప, ఆ జ్ఞానం మనకు అసలు ఆ సృష్టి క్రియ ఏమిటో వివరించ లేదు. అసలు అదేమిటో చెప్పలేదు.

ఫ్రాయిడ్ చెప్పనే చెప్పాడు: కళాత్మక చిత్ర స్వభావాన్ని మనం మనో విశ్లేషణ చేయలేం. కళాకారుడు తన సృజన సామర్థ్యాన్ని ఎక్కడ నుంచి పొందుతాడో అది మార్మికం: సైకాలజీకి అది అందుబాటులో లేదు. అది మార్మికం. అది అంతే.

సృజనాత్మకత గురించి, దానికీ స్వేచ్ఛకూ ఉన్న సంబంధాన్ని గురించి సృజనాత్మక వ్యక్తులను అధ్యయనం చేసి ఎంతో తెలుసుకోవచ్చు:

ఒకసారి షికాగో విశ్వవిద్యాలయం మేధావులని తేలిన కొందరు విద్యార్థులను రెండు సమూహాలుగా విభజించి అధ్యయనం చేసింది. అందులో ఒక సమూహం కళావృత్తులను చేపట్టిన మేధావులు. వీరిని 'సృజనాత్మక విద్యార్థుల'న్నారు. రెండో సమూహాన్ని కేవలం మేధావులన్నారు.

సృజనాత్మక విద్యార్థులు రెండో వర్గం కంటే, రిజర్వుడ్‌గా, అంతర్ముఖులుగా, ఊహాత్ములుగా, లోతుగా ఆలోచించే వారుగా, నీతి - అవినీతుల కతీతులుగా అంటే **amoral** గా, మగ అయితే ఆడవారి, ఆడ అయితే మగవారి లక్షణాలను అధికంగా కలిగి ఉండేవారిగా ఉన్నారు. అనుగుణవర్తనులు గాక, వీరు స్వతంత్రంగా వ్యవహరించారు. వారు గురువుల యెడ అంత శ్రద్ధ చూపలేదు. తమ మార్గాన తాము, తమ అంతర్గత మృదంగ ధ్వనుల కనుగుణ్యంగా నడిచారు. పనిలోనే కాదు, ఆలోచనలలో గూడ స్వయం చాలకులు. మన సమాజంలో మెచ్చుకొనే అతిబలమైన అహం **(very strong ego)** గాని అతిప్రభావకమైన మూర్తిమత్వం **(dominent personality)** గాని వారిలో ద్యోతకం కాలేదు. మనం గొప్పగా భావించే ఆర్థిక, సామాజిక, రాజకీయ విలువలంటే వారంత శ్రద్ధ చూపలేదు. వారు కళాత్మక సౌందర్యాత్మక, సైద్ధాంతిక విలువలంటే మిక్కిలి మక్కువ చూపారు. విజయానికంటే 'సత్యా'నికి ఎక్కువ ప్రాముఖ్యమిచ్చారు. ''అహం బలా''నికి అంత ప్రాముఖ్యం ఇవ్వకపోయినా, ''స్వయం సమృద్ధి'' **(self - sufficiency)** కి, దృఢ నిర్ణాయకత **(resoluteness)** కు ఇచ్చారు. అసలు నిజం చెప్పాల్సి వస్తే వ్యక్తిక బలానికి **(personal strength)** కు ఇవే ఆనవాళ్ళు. ఈ లక్షణాలన్నీ గూడ అననుగుణ్యత, స్వయంచాలకత, దృఢ నిశ్చిత అంతర్గత విలువలు - గూడ వారి అంతర్గత స్వేచ్ఛను కాపాడుకోవడానికి చేసే ప్రయత్నాలని తెలుతుంది.

ఈ అధ్యయన ఫలితాలను చూస్తే, మన విద్యా వ్యవస్థలో ఇమడలేక మధ్యలోనే స్కూలు, కళాశాలలు మానివేసిన సృజనాత్మక వ్యక్తులు గుర్తువస్తారు. లూయి మమ్‌ఫర్డ్ కొద్దికాలమే న్యూయార్క్ సిటీ కళాశాలకు వెళ్ళాడు. బక్ మాస్టర్ ఫులర్ హార్వర్డ్ నుంచి సగం కాలంలోనే మానివేశాడు. విలియమ్ ఫాల్కనర్ - విశ్వవిద్యాలయంలో స్వల్పకాలమే చదివాడు. స్కూలులో ఐన్‌స్టెయిన్ పడ్డ కష్టాలు అందరికీ తెలిసినవే.

వాస్తవానికి సృజనాత్మక శీలుర శీలలక్షణం తమ అంతర్గత మార్గ నిర్దేశకత్వ అంతర్వాణిని వినగల సామర్థ్యం వారికి ఉంది. ఎప్పుడు, ఏ అనన్య, అసాధారణ దర్శనాన్ని (vision)ను, అనుసరించాలనేది వారికి అవగతమవుతుంది. ఒక ప్రబోధ, ఒక అంతర్గత శక్తి, ఒక పీడనం వారిని ముందుకు నెడుతూ ఉంటుంది. ఈ కారణంగా వారి విధానాలు పద్ధతులు విపరీతంగా కనిపిస్తాయి.

'ధైర్యం' సృజన శీల లక్షణం. **The study of creative persons** అనే వ్యాసంలో మాక్కినన్ ఇలా అంటాడు: ''సృజనాత్మక వ్యక్తి శీల లక్షణాలలో ధైర్యం ముఖ్యమైంది.... అంటే సంపూర్ణార్థంలో ఒకడు తాను తానుగా ఉండడం తాను ఏమేరకు ఎదగగలడో, మారగలడో చాలవరకు ఆ విధంగా ఎదగడం, తన సామార్థ్యాలను పెంచుకోవడం, ఆత్మయధార్థీకరణం చెందడం. సృజనాత్మక వ్యక్తి తాను ఇతరుల మీదవేసే ముద్ర గురించి ఆలోచించడు గనుక ఇతరులో తనను గురించి ఏమను కొంటున్నారనేదానికి విలువ ఇవ్వడు గనుక, చాలా మందికంటె తను తానుగా ఉండడం **to be himself** లో అతనికి ఎక్కువ స్వేచ్ఛ ఉంది.''.

సృజనాత్మక వ్యక్తి పిల్లవాడూ కథలల్లుతాడు. ఎక్కువ పగటి కలలు కంటాడు. ఎన్నో ఆశలు పెంచుకొంటాడు, తనకో భవిష్యత్తును నిర్మించుకొంటూ, ఇవన్నీ ఒక అనివార్య విధి **destiny** గా రూపొందుతాయి. అతడు తన అంతర్గత ప్రపంచాన్ని నిర్మించుకొంటాడు. ఈ ప్రపంచంలో అతడు తన భావిని చూస్తాడు. తన విధిని చూస్తాడు. అది ఆవిష్కారం అయిన మేరకు అతడు దానితో సమీకరణం చెందుతాడు. దానిని అతడు కనుగొన్న మేరకు **to the excellent it is invented,** అతడు తన అన్వేషక సామర్థ్యాలను వాస్తవ ప్రపంచానికి దోహదాలుగా మారుస్తాడు.

సృజనాత్మక వ్యక్తులను అధి నైతికులు **amoral** అన్నాం. నీతి అవినీతులకు సంబంధంలేని వారంటే వారు అవినీతి పరులని అర్థం కాదు. కాని వారికి సంప్రదాయ బద్ధనీతిని అనుసరించని స్వేచ్ఛ ఉంది. వారు ఒక నూతన నీతిని ప్రదర్శిస్తారు. వారికి కావలసింది పైపై నియమాలు, సూత్రాలు, ధర్మాలు కాదు. సమగ్ర నిజాయితీ అంటే **integrity.** వారికి వివాహం అంటే కాగితం మీద రాసిన ఒప్పందం కాదు, నిజాయితీతో గూడిన సంబంధం. వీరికి కావలసింది ఆరోగ్య సూత్రాలు కావు. ప్రకృతి యెడ, దేహం యెడ ''గౌరవం''.

ఈ విధంగా సృజనాత్మక మనస్సు అంటే అనాకారం నుంచి ఆకారాన్ని, గందరగోళంలో ఒక నూతన వ్యవస్థను చూసే సామర్థ్యమే. సృజనాత్మక వ్యక్తి 'దర్శనం' అంటే ప్రపంచంలోని ఆకృతుల సంబంధాల రూపాన్ని చూడడం. ఈ రకంగా ప్రకృతిని లోతుగా చూడడం వల్ల అసలు మన మొత్తం అస్తిత్వం మీదే నూతన వెలుగు గోచరమవుతుంది. మన స్వయం సమృద్ధతకు నూతన అర్థం ఏర్పడుతుంది. ప్రపంచానికి మనకు మధ్య ఐక్యతను సమరసాన్ని ప్రసాదిస్తుంది. సృజనాత్మకత మన వ్యాకులత మీద శీతల చందన తైలంలా పనిచేస్తుంది. పరాయి తనానికి విరుగుడు మందు ఇది. మన జీవితాలలో వెలితికి, అరూపతకు ఒక నిర్మాణాత్మక రూపాన్ని ఇస్తుంది.

(ఆల్ ఇండియా రేడియో విజయవాడవారి సౌజన్యంతో)

# చైనా నవల

## (1938వ సం॥ నోబెల్ సాహిత్య పురస్కారోపన్యాసం)

మూలము : పెరల్.ఎస్.బక్ అనువాదము : డా. యు. ఏ. నరసింహమూర్తి

(గత సంచిక తరువాయి)

శతాబ్దాల జాడ్యం తరువాత ఆధునిక చైనా సాహిత్య సాంయాత్రికులిప్పుడు ఆ విషయాన్నే శోధిస్తున్నారు. పశ్చిమ దేశాల విశ్వవిద్యాలయాలలో శిక్షణ పొందిన చైనా సాహిత్య విమర్శకులు పాతికేళ్లుగా తమచే నిర్లక్ష్యం చేయబడిన నవలలను కనిపెట్టడానికి తలపడ్డారు. కాని ఆ నవలల రచయితలను వారు కనిపెట్టలేరు. షూ ఇ హు చువాన్ (Shui Hu Chuvan) అనే నవలను ఒకడు ఒక్కసారిగా రాసేడా? ఎందరో ఎన్ని శతాబ్దాల్లోనో దానిని తవ్వితలపోసి చేర్పులు మార్పులతో ఇప్పటి రూపానికి తెచ్చేరో? ఎవరు చెప్పగలరు? వారెవ్వరూ ఇప్పుడు లేరు. వాళ్లు బతికిన రోజుల్లో చూసిందీ విన్నదీ వాళ్లు రాసేరు. వాళ్ల కోసం వాళ్లేమీ రాసుకోలేదు. 'ఎర్ర గది కల' (The Dream of the Red Chamber) తన గ్రంథం పీఠికలో ''హాన్ - సాంగ్‌ల కాలాన్ని గూర్చి తెలుసుకోవలసిన అవసరం లేదు. నేను బతికిన కాలాన్ని గూర్చి చెప్పడమే అవసరం'' అని రాసేడు.

వాళ్లు బతికిన కాలాన్ని గూర్చి రాసేరు. పవిత్ర నేపథ్యంలో జీవించేరు. పాండిత్య నియమాల ననుసరించి రాసేరా లేదా అంటూ తమపై వచ్చిన విమర్శా గ్రంథాలను గాని, సమీక్షలను గాని వాళ్లు చదవలేదు. పండితుల ఆమోదముద్ర కోసం వారెప్పుడూ పడిగాపులు పడలేదు. తమకు ఓపిన మేరకు తమకు తృప్తి కలిగేలా రాసేరు. ఒక్కొక్కప్పుడు తమకు తెలియకుండానే గొప్పగా రాసేవాళ్ళు. ఒక్కొక్కప్పుడు తమకు తెలియకుండానే పాడుచేసేవాళ్లు. ఆ సంతోష నేపథ్యంలోనే వాళ్లు మరణించేరు; అంతరించిపోయేరు. ఇంతకాలం గడచేక చైనాలోని పండితులంతా కట్టగట్టుకొని వాళ్లను గౌరవించ డానికి ముందుకొచ్చినా వాళ్లను తవ్వి తలకెత్తుకోలేరు. ఆ సాహిత్య శవ పరీక్షకు అవకాశమివ్వనంత గతంలో కూరుకుని పోయివున్నారు వారు. చైనా సామాన్య ప్రజానీకం చేతి నుండి చేతికి కాకపోయినా నోటి నుండి నోటికి అందిస్తూ వచ్చిన కారణంగా ఆ గొప్ప నవలలు మాత్రం నేటికీ బతికి బట్టకట్టి వ్యాప్తిలో ఉన్నాయి.

షుఇ హు చువాన్ (Shui Hu Chuvan) అనే నవల ఇటీవలి ప్రచురణకు పీఠిక రాస్తూ షినాయ్ అన్ (Shih Nai An) అనే రచయిత నవలా నిర్మాణం గూర్చి ఇలా అన్నాడు ''నేను చెప్పేది ప్రజలకు తేలికగా అర్థం కావాలనుకుంటాను. మంచివాడు, చెడ్డవాడు, చదువునేర్చిన వాడు, చదువురానివాడు అన్న తేడా లేకుండా ఎవడైనా దీనిని చదవగలడు. ఈ పుస్తకం బాగా పోయిందా లేదా అనే అంశాన్ని గూర్చి ఎవరూ బాధపడవలసిన పనిలేదు. నేను మరణించడానికే పుట్టాను, నా తర్వాత తరాల వాళ్లు ఈ పుస్తకాన్ని గూర్చి ఏమనుకుంటారో నాకెలా తెలుస్తుంది? ఇంకో జన్మలో ఈ పుస్తకాన్ని గూర్చి నేనే ఏమనుకుంటానో నాకే తెలియదు. అప్పుడు నేను చదవగలనో లేదో నాకే తెలియదు. దీని గురించి నేనెందుకు పట్టించుకోవాలి?''

కొందరు పండితులు గోప్యంగా ఉండగల స్వేచ్ఛను చూసి అసూయ పడతారు. ఇతరుల ముందు వెల్లడించడానికి ధైర్యం చాలని వ్యక్తిగత విషాదాల భారాన్ని మోసేవారు తాము సృజించిన కళారూపాలలో

---

డా॥ యు. ఏ. నరసింహమూర్తి, విజయనగరం,
మహారాజా కళాశాలలో తెలుగు శాఖాధ్యక్షులుగా ఉన్నారు.

ఆ బాధల నుండి ఊరట పొందే ప్రయత్నం చేస్తారు. అందుకు కలం పేరుతో నవలలు రాస్తారు. అటువంటి సందర్భాలలో ఆడంబరాన్ని వదలి సామాన్య నవలాకారుడిలా తేలికగా, సహజంగా రాస్తారు. ఆ నవలాకారుడు సాంకేతిక స్పృహను పట్టించుకోడు. వస్తువెలా కోరితే అలా రాస్తాడు. నవలాకారుడు ఒక నిర్దిష్టశైలికి, సాంకేతిక ముద్రకు కట్టుబడితే ఆ మేరకు అతడు మంచి నవలా రచనకు ముగింపు పలికి ఒకశైలీ నిర్మాతగా, సాంకేతిక నిపుణుడిగా మాత్రమే నిలిచిపోతాడు.

చైనాలో నేనొక విషయం నేర్చుకున్నాను. మంచి నవలాకారుడు సహజత్వానికి, దేనికీ లొంగని స్థితికి తప్ప మిగిలిన వాటన్నిటికీ అతీతంగా ఉండాలి. తనలో ప్రవహించే వస్తు ధర్మానికి మైనంలా వంగి ఎలా పడితే అలా మారగలిగి ఉండాలి. అతని పనల్లా తనలోంచి ప్రవహించే జీవితాన్ని ఆయా విభాగాల్లో అమర్చి వుంచడమే. చిద్రుపలు చిద్రువలుగా చెదరిపడ్డ స్థల కాల సంఘటనావధుల అపరిహార్యమైన అంతర్నిర్మాణాన్ని కనిపెట్టి వాటికి ఒక లయను, రూపాన్ని కూర్చాలి. కొన్ని పుటలు చదివేసరికి నవలాకారుడెవరో మనకు తెలిసిపోకూడదు. స్థిరమైన శైలి రచయితకు బందిఖానా. చైనా నవలాకారుల రాత సంగీతం లాంటిది. వస్తువు ననుసరించి అది మారిపోతూ ఉంటుంది.

పాశ్చాత్య ప్రమాణాల ననుసరించిన సౌష్ఠవం చైనా నవలలకు లేదు. ఆనవలల్లో ఆద్యంతాలకు సంబంధించిన ప్రణాళిక, బిగింపు ఉండవు. జీవితంలో ఉన్నపాటి ప్రణాళిక, బిగువు మాత్రం ఉంటాయి. అవి తరచుగా కొండవీటి చేంతాళ్లలా ఉంటాయి. సన్నివేశాలు కుమ్మర తమ్మరగా ఉంటాయి. పాత్రలు తొక్కిసలాడుకుంటూ ఉంటాయి. వస్తువు కల - నిజం కలగలుపుగా ఉంటుంది. పద్ధతి ఊహ - వాస్తవాల కలగలుపుగా ఉంటుంది. ఇంద్రజాలం, స్వప్నం వంటి అసంభావ్య సంఘటనలు అచ్చుమచ్చుగా పోలిక కుదిరేటట్లు వివరంగా వర్ణించి హేతువాదాన్ని తృణీకరించి ప్రతివాడూ ఆ విశ్వాసానికి కట్టుబడి ఉండేలా చేస్తుంది. ప్రాచీన ప్రజల ఆలోచనలు స్వప్నాలు జానపదరీతులలో మునిగితేలిన కారణంగా ఆ కాలపు నవలలో జానపద బాణీ నిండి వుంది. ఆ నవలలను చదవని వారెవరూ ఈ రోజు చైనా మనసులోకి తొంగి చూడలేరు. ఎందుచేతనంటే - ఇప్పటిచైనా మనసుకు రూపకల్పన చేసినవి ఆ నవలలే. చైనా దౌత్యవేత్తలు - పాశ్చాత్య దేశాలలో శిక్షణ పొందిన పండితులు మనను ఎంత భిన్నంగా నమ్మింప జూసినా వారిలో ఇప్పటికీ కొనసాగుతున్నది జానపద మౌఢ్యమే. జార్జి రస్సెల్ ఐర్లండు ప్రజల మనసును గూర్చి ''జానపద భావనలతో నిండిన ఆ మనసు దేనినైనా నమ్ముతుంది. వెండి తెర చాపల బంగారు నౌకలు, సముద్రాల మీద శ్వేత నగరాలు, గంధర్వలోకాలు, వరాలు - అదింకా సృష్టించగలదు. అంత విశాలమైన జానపద హృదయం రాజకీయాల్లోకి దిగితే దేన్నైనా నమ్మగలదు'' అంటాడు. ఇప్పటికీ చైనా మనసు ఇలాగే వుంది.

చైనా నవల కథగా మారిన ఈ జానపద హృదయంలోంచి వేల సంవత్సరాలలో క్రిక్కిరిసిన జీవితంలోంచి పెరిగింది. పెరుగుతూన్న కొద్దీ మారింది. ఏ నవలా ఒకరి పేరు మీద లేదు. అవి ఏ ఒక్క చేతిమీద రాయబడినవి కావు. గాలి కబుర్లు కథలుగా మార్చి ఆ నోటా ఈ నోటా రంగులు మారి ఎన్నో చేతుల మీదుగా రూపం దాల్చిన రచన అది. 'తెల్లపాము' **(Pei She Chuan)** అన్న కథ అందరికీ తెలిసినదే. త్సాంగ్ సామ్రాజ్యంలో ఎవరో అనామకుడు రచించిన కథ అది. మానవతీత శక్తులు గల ఆ మామూలు కథకు ఒక పెద్దపాము నాయకపాత్రలో ఉంది. ఒక శతాబ్దం దాటేటప్పటికి ఆ కథలోని పాము ఒక రక్తపిశాచి అయిన స్త్రీగా మారింది. కాని మూడవ దశలో ఆ కథ మృదువైన మానవతా స్పర్శను పొందింది. ఇందులో దుష్టశక్తి రక్తపిశాచి అయిన స్త్రీ విశ్వాస పాత్రురాలైన ఒక

భార్యగా మారి వంశోద్ధారకుడైన కుమారుణ్ణి కంటుంది. ఈ మార్పులో ఒక కొత్త పాత్రే కాక కొత్త లక్షణం కూడా ఉంది. ఇది మానవాతీతశక్తుల కథగా ముగియలేదు. మానవులతో కూడిన నవలగా ఆరంభమయింది. చైనా నవల పరిణామానికి ఇది ఒక ఉదాహరణ.

ప్రణయ కథలు పెళ్లికి దారితీసే ప్రేమతోను, పెళ్లితోను నిర్వహింపబడలేదు. వివాహేతర సంబంధాలతో నిండివున్నాయి. ఇందులో వింతలేదు. పెళ్లే కథావస్తువైతే ఆ కథ విషాదాంత మౌతుందని తెలుస్తుంది. పీలిషి (Pei Li Shi) ఛి యో ఫాంగ్ ఛి (Chias Fang Chi) అన్న రెండు ప్రసిద్ధ కథలు వివాహేతర సంబంధాల మీద రాసినవి. వేశ్యల ఆధిక్యాన్ని నిరూపించే కథలివి. చదువు రాత ఆట పాట తెలిసిన అందమైన స్త్రీలు వాళ్లు. చదువు సంధ్యలేని మామూలు గృహిణిని చైనాలో ఇప్పటికీ 'గబ్బు ముఖం ఆడది' **("Yellow - faced woman")** అంటూ ఉంటారు.

సాధారణ ప్రజానీకంలో విస్తృత వ్యాప్తి పొందిన ఈ వైఖరి అధికార యంత్రాంగాన్ని మేల్కొలి పింది. చైనా సంస్కృతిని - సాంసారిక వ్యవస్థను భగ్నం చేసే ఈ ప్రమాదకరమైన తిరుగుబాటు ధోరణిని వారు బహిరంగంగా వ్యతిరేకించేరు. అభివృద్ధి నిరోధక తత్త్వం మాత్రం కొరవడలేదు. అనంతర కాలంలో వచ్చిన ప్రసిద్ధ రచన హు ఛెన్ ఛి **(Hui Chen Chi)** తొలి రూపాలలో ఒక దానిలో ఒక యువ పండితుడు యింగ్ యింగ్ **(Ying Ying)** అనే అందకత్తెను ప్రేమించి చివరకు తిరస్కరించి ''అసాధారణ స్త్రీ లందరూ ప్రమాదకారులు వాళ్ళునాశనమై ఇతరులను నాశనం చేస్తారు. వాళ్లు చక్రవర్తులను సైతం నాశనం చేసేరు. నేను చక్రవర్తిని కాదు. అంచేత దానిని వదిలేస్తాను'' అనే విచక్షణతో దానిని వదిలిపోయాడు. బుద్ధిమంతులందరూ ఆ యువకుడి చర్యను ప్రశంసించేరు. మర్యాద మీరని ఆ యువతి ''నన్నుంచుకున్నాళ్ళు ఉంచుకున్నావు. వదిలెయ్యాలనుకున్నప్పుడు వదిలిపెట్టావు. అది నీ హక్కు, నేను నిన్ను తప్పు పట్టను'' అని బదులు చెప్పింది. కాని ఐదు వంద ల వేళ్ల తర్వాత పాపభీతి నిండినచైనా సాధారణ హృదయం ముందుకు నడచి చెదరిపడ్డ ఈ ప్రణయగాథను క్రమబద్ధం చేసే పునారచన కొనసాగింది. ఈ ఆఖరు ప్రతిలో రచయిత ఆ యువతీ యువకులను భార్యాభర్తలను చేసి ''ప్రపంచ ప్రేమికులందరూ సడలని వివాహ బంధంతో కలిసి ఉంటారని ఆశిస్తున్నాను'' అంటూ మంగళశాసనం పలుకుతాడు. చైనాలో గడుస్తూన్న కాలంలో, సుఖాంతం కోసం ఎదురుతెన్నులు చూడడానికి ఐదువందల వేళ్ల కాలం ఒక లెక్కలోనిది కాదు.

ఇది చైనాలో బాగా ప్రఖ్యాతి పొందిన కథ. సంగ్ వంశ పాలన కాలంలో చావో టే లియాంగ్ **(Chao Teh Liang)** 'ఒల్లని సీతాకోక చిలుక' **(The Reluctant Butterfly)** అన్న పేరుతో పద్యరూపంలో దీన్ని తిరిగి రాసేడు. మళ్లీ యువాన్ వంశ పాలనలో టుంగ్ ఛై- యూన్ **(Tueng Chai - Yuen)** సూహ్ హ్సి హ్స్యాంగ్ **(Suh Hsi Hsiang)** అన్న పేరుతో గేయ రూపకంగా రాసేడు. మింగ్ వంశపాలనలో ఇది తిరిగి రెండు రకాలుగా రాయబడింది. లి రే హువా **(Li Reh Hua)** దీనిని నన్ హ్సి హ్స్యాంగ్ ఛి **(Nan Hsi Hsiang Chi)** అన్న పేరుతో దాక్షిణాత్య ఛందస్సంప్రదాయమైన 'త్సె' **(ts'e)** రూపంలో రాసేడు. ఇందులో ఆఖరిది బహు ప్రముఖమైనది హ్సి హ్స్యాంగ్ ఛి **(Hsi Hsiang Chi)** ఛాంగ్ సేన్ **(Chang Sen)** పేరు చైనాలో పసిపిల్లలకు కూడా తెలుసు.

ఇంకోలాంటి కథ లక్కడ లేకపోలేదు. స్త్రీ పురుషుల మధ్య నడచే ప్రణయవృత్తం నవలకు టాంగ్ **(T'ang)** ఇచ్చిన ముఖ్య బహుమతి. అందుకే టాంగ్ కాలం నాటి ప్రణయ కథలను గూర్చి ఇంతగా నొక్కి చెపవలసి వచ్చింది. హాస్య ప్రాధాన్యం, అధి క్షేప ప్రవృత్తి గల నవల లెన్నో ఉన్నాయి.

రాజదర్బారుల్లో ఆ రోజుల్లో ముఖ్య వినోదమైన కోడిపోరు ఇతివృత్తంగా ఆసక్తికరమైన కథ ఉంది. ఛెన్ హంగ్ (Chin Hung) రాసిన టుంగ్ ఛెన్ లావో ఫుచువాన్ (Tung Chen Lao Fu Chuan) అన్న రచన ఈ తీరు కథల్లో గొప్పది. ఛియా ఛాంగ్ (Chia Chang) అనే ప్రఖ్యాత కోడిపోరు నిపుణుడు చక్రవర్తికి సామాన్య ప్రజలకు ఎలా ప్రేమపాత్రుడయ్యాడో ఈ కథ చెప్తుంది.

కాల ప్రవాహం ఆగదు సంగ్ వంశ పాలనలో నవలా ప్రక్రియ స్పష్టంగా ఆరంభమయింది. యువాన్ వంశ పాలనలో ఆ పుష్ప సౌరభాలు ఎన్నడూ అధిగమించలేని ఎత్తుల్లో పరిమళించేయి. అప్పటి రచనల్తో సాటి చెప్పగలదిగా హంగ్ లౌ మెంగ్ (Hung Lou Meng) లేక 'ఎర్రగదికల' (The Dream of Red Chamber) అనే నవల ట్సింగ్ వంశ పాలనలో రచింపబడింది. శతాబ్దాల పాటు ఎవరి దృష్టీ సోకకుండానే నవల పెరిగి పెద్దదయింది. ప్రజలలో వేళ్లు తన్నుకున్న నవల కాండమై కొమ్మై రెమ్మై ఆకై యువాన్ వంశపాలనలో విరగ బూసింది. ఆ పాత దేశంలోకి మంగోలు యువకులు విజేతలుగా చేరేరు. వారి మెదళ్లు బలిష్టమైనవి, ఆకలి నిండినవి, అశిక్షితమైనవి. వాటికి మేత అవసరమయింది. ఆ మెదళ్లకు ప్రాచీన సాహిత్యపు ఊక దంపుడు మేత పనికి రాలేదు. వాళ్లు నాటకం, నవల అనే రూపాల మీద తహతహ లాడుతూ విరుచుకుపడ్డారు. సాహిత్య గౌరవం సిద్ధించక పోయినా, ఈ కొత్త జీవితంలో సామ్రాజ్య పోషణ అనే సూర్యకాంతిలో చైనాలోని ప్రముఖ నవలాత్రయంలోని రెండు నవలలు షు ఇ హు చువాన్ (Shui Hu Chuan) సాన్ కువొ (San Kuo) వెలువడ్డాయి. హంగ్ లౌ మెంగ్ (Hung Lou Meng) అనేది మూడవ నవల.

ఈ మూడు నవలల పరమార్థమేమిటో, అవి చైనా ప్రజల కందించిన దేమిటో నేను మీకు తెలియ జేయగలను. పాశ్చాత్య సాహిత్యంలో వీటితో పోల్చదగినవి నా ఆలోచన కందడం లేదు. 'ఇక్కడ నవల పతాక స్థాయి నందుకుంది' అన్ని చెప్పగల ఇంత స్పష్టమైన ఉద్యమ మేదీ మన నవలా చరిత్రలో లేదు. చైనా నవల ప్రజా సాహిత్యమని చాటి చెప్తే బుజువులీ మూడు నవలలు. ఉన్నత శ్రేణి సాహిత్యం సంగతి అలా వదిలేస్తే, ఈ మూడు నవలలు ప్రజావాఙ్మయపు పరిపూర్ణ స్మారక చిహ్నాలుగా నిలుస్తాయి. విద్వాంసులు వీటిని కూడా తృణీకరించారు. ప్రమాదకరమైనవి - తిరుగుబాటు ధోరణివి - దిగజారినవి అనే ముద్రలతో అనంతర వంశాల పాలనలో వీటిని నిషేధించారు. కాని ప్రజలు వాటిని చదివేరు. కథలుగా చెప్పుకున్నారు. వీర గాథలుగా అల్లి పాడుకున్నారు. నాటకాలుగా ప్రదర్శించేరు. అవి బతుకుతూనే వచ్చేయి. అసూయాగ్రస్తులైన పండితులు బలవంతంగానైనా వాటిని గుర్తించక తప్పలేదు. అప్పటికే వారు వాటిని నవలలని అంగీకరించలేదు. ప్రతీక రచనలన్నారు. ఆపేరు పెట్టీనంతలో వాటికేదో సాహిత్య గౌరవం కట్టబెట్టవచ్చునన్నట్లు ప్రవర్తించేరు. ప్రజలెవ్వరూ వారి మాటల్ని పట్టించుకోలేదు. విద్వాంసులు ఆ వాదాన్ని స్థాపించడానికి రాసిన విమర్శ గ్రంథాలను ప్రజలు చదువలేదు. ఆ నవలల్ని చదివి ప్రజలు ఆనందించేరు. కథను విని ఆనందించడం కోసమే ఆ నవలలు పుట్టేయి. ఆ కథల్లో ప్రజలు తమను తాము వెల్లడి చేసుకున్నారు.

బహుశా ప్రజలే ఆ నవలల్ని రాసి ఉంటారు. షుఇ హు చువాన్ (Shui Hu Chuan) అధునాతన ప్రతుల రచయితగా షినాయ్ అన్ (She Nai An) ను పేర్కొంటున్నా ఆ నవలను రాసిన వారొకరు కారు. సంగ వంశ పాలనలోని దొంగల గుంపుకు చెందిన ఎన్నో కథలు కలిసి ఈ గొప్ప నవలా రూపాన్ని దాల్చేయి. దీని మూలాలు చరిత్రలో ఉన్నాయి. దొంగలు పట్టుకున్న అసలు అబద్ధాలకోరు ఇప్పటికీ షాంటంగ్ (Shanting) లో ఉన్నాడు. క్రీ.శ. 13వ శతాబ్దంలో చైనా భిన్నాభిన్నమై వుంది. హ్యామ్

ఘుంగ్ (Huei Chung) చక్రవర్తి పాలనలో సామ్రాజ్యం అస్తవ్యస్తమై క్షీణదశకు చేరుకుంది. ధనికులు మరీ ధనికులయ్యారు. పేదలు మరీ పేదలయ్యారు. ఈ పరిస్థితిని చక్కదిద్దడానికెవరూ ముందుకు రాని పరిస్థితిలో నిజాయితీపరులైన దోపిడి దొంగలే అందుకు తలపడి ముందుకు వచ్చారు.

ఈ నవల సుదీర్ఘాభివృద్ధి గాధను గాని, అది ఎందరి చేతుల్లో ఎన్ని మార్పులు పొందిందో అన్నది గాని నేనిప్పుడు చెప్పలేను. షినాయ్ అన్ (Shih Nai An) ముతక రూపంలో ఉన్న ఈ నవలను ఒక పాత పుస్తకాల కొట్లో కొని, ఇంటికి తెచ్చి దానిని తిరగరాసేడు. అతని తర్వాత ఈ కథను ఎందరో మళ్లీ మళ్లీ చెప్పేరు. ఇప్పుడు ఐదారు ప్రతులు వ్యాప్తిలో ఉన్నాయి. ఘుంగ్ ఇషు ఇహు (Chung I Shui Hu) అన్న పేరుగల ప్రతిలో నూరు అధ్యాయాలున్నాయి. ఇంకొక దానిలో నూట ఇరవై యేడు అధ్యాయాలున్నాయి. ఇంకొక ప్రతిలో నూరు అధ్యాయాలున్నాయి. షినాయ్ అన్ (Shi Nai An) రచనగా చెప్పబడుతూన్నా మూలప్రతిలో నూట ఇరవై అధ్యాయాలున్నాయి. ఇప్పుడు బహుళ ప్రచారంలో వున్న ప్రతి డెబ్బై అధ్యాయాలే ఉన్నాయి. మింగ్ వంశ పాలనాకాలంలో ప్రసిద్ధుడైన ఛింగ్షెన్ టాన్ (Ching Shen Tan) దీనిని రూపిందించేడు. ఏ బాలుణ్ణీ ఈ పుస్తకం చదవకుండా ఆటంకపరచడం సాధ్యంకాదు. కాబట్టి తన కొడుకు చదువుకోవడానికి తానే ఈ పుస్తకాన్ని మార్పుచేసి రాసినట్లు ఆయన చెప్పుకున్నాడు. షు ఇహు చదవకుండా ప్రజల్నెవరూ నిరోధించలేరు కాబట్టి ప్రభుత్వాదేశాన్ననుసరించి కూడా ఈ నవలకు సవరణ ప్రతి ఒకటి రూపొందించబడింది. 'ఈ ప్రభుత్వ ప్రతి టుంగ్ కోవ్ ఛి (Tang K'ou Chi, or, Saying Wste the Robbers) అనే పేరుతో వెలువడింది. ప్రభుత్వ సైన్యాలు చిట్టచివరకు దోపిడి ముఠాలను ఓడించి నాశనం చేసినట్లు ఈ కథ చెప్తుంది. కాని చైనా ప్రజలకు స్వేచ్ఛ తప్ప ఇంకొకటి తెలియదు. వాళ్లు ప్రభుత్వప్రతి నొక్కనాటికీ అంగీకరించలేదు. అందుకే మూలప్రతి ఇంకా నిలిచే వుంది. అది వారికి బాగా తెలిసిన సంఘర్షణ. అవినీతి పరమైన అధికారయంత్రాంగానికి రోజువారీ ప్రజలకు మధ్య నడచిన సంఘర్షణ.

షు ఇహు చువాన్ (Shui Hu Chuan) అనే నవల కొంతవరకు Les Chevaliers Chinois అన్న పేరుతో ఫ్రెంచి భాషలోకి అనువదించబడింది. All Men Are Brothers అన్న పేరుతో నేను అనువదించేను. 'దోపిడి దొంగలు - అబద్ధాలకోర్లు' అనే అర్థం ఇచ్చే మూలనామం ఇంగ్లీషులో అర్థరహితంగా ఉంటుంది. ఆ పేరు చైనా వారికి శతాబ్దాల నాటి జ్ఞాపకాలను రేపుతుంది కాని మనకు అలాకాదు.

ఈ నవల పూర్తిగా బతికి బట్ట కట్టింది. ఈ కొత్త రోజుల్లో చైనాలో దానికొక అదనపు గుర్తింపు లభించింది. చైనా కమ్యూనిస్టులు ఆ పుస్తకానికి ప్రముఖ కమ్యూనిస్టు నాయకునిచే పీఠిక రాయించి ప్రచురించి దానిని తొట్ట తొలి కమ్యూనిస్టు సాహిత్య గ్రంథంగా ప్రకటించేరు. కాలాన్ని అధిగమించగలగడం ఆ నవల గొప్పతనానికొక ఋజువు. పూర్వ సామ్రాజ్యాలలాగే అది కూడా నేడొక నిజం. పూజారులు - వేశ్యలు, వ్యాపారులు - పండితులు, పతితలు - పతివ్రతలు, ముదుసలులు - యువకులు, ఆఖరికి గడుగ్గాయి బడిపిల్లలు - ఇలా చైనా ప్రజలంతా ఇంకా ఆ పుటల వెంట పరుగులు తీస్తున్నారు. పాశ్చాత్య పద్ధతిలో శిక్షణ పొందిన పండితుడెవడూ దానిమీద పి. హెచ్.డి. పట్టా పుచ్చుకుని కనబడలేదింత వరకు. అలాంటి వాడెవడైనా చైనాలో ఉండి వుంటే తన కొత్త అధ్యయనరీతుల దైన్యాన్ని, విషాదాన్ని నిరుపయోగితను అసమగ్రతను వెల్లడిస్తూ చివికి శీర్ణమైన పాత చొక్కా మీది చాలీ చాలని కొత్త మాసికలా ఆ పుటల మీద తన హస్త ప్రక్షేపం చేస్తూ కనిపించి వుండేవాడు.

''యువకులు షుఇ హు (Shui Hu) చదవకూడదు. వృద్ధులు సాన్ కుఓ (San Kuo) చదవకూడదు'' అని చైనావారు చెప్తారు. ఆ పుస్తకాలు చదివితే యువకులు దోపిడి దొంగలవడానికి ఉత్సాహిస్తారని, వృద్ధులు వారి వయసుకు మించిన శక్తిని ప్రదర్శించడానికి తలపడతారని వారి భావన. షుఇ హు చువాన్ (Shui Hu Chuan) చైనా జీవితాన్ని పొందుపరచిన గొప్ప సామాజిక ప్రమాణపత్రము. సాన్కుఓ (San Kuo) యుద్ధాలను రాజనీతిని వివరించే ప్రమాణపత్రను. హుంగ్ లౌ మెంగ్ (Hung Low Meng) సాంసారిక జీవితాన్ని, మానవ ప్రేమను వెల్లడించే ప్రమాణపత్రము.

షుఇ హు (Shui Hue)లాగా సాన్కుఓ (San Kuo) కూడా నిర్మాణసౌష్ఠవం కలది; కర్త ఎవరో తెలియనిది. అది మూడు రాజ్యాల కథ. హాన్ వంశ పాలనకు చెందిన ముగ్గురు మిత్రులు శాశ్వత సోదరత్వం కోసం ప్రమాణం చేయడంతో ఆరంభమైన ఆ కథ తొంభై ఏడు సంవత్సరాల తర్వాత ఆరు వంశాల అనువంశిక పరిపాలన తరువాత ముగుస్తుంది. లో కువాన్ ఛుంగ్ (Lo Kuan Chung) అనే రచయిత దాని ఆఖరి ప్రతిని తిరగ రాసేడు. ఆ రచయిత షుఇ హుచువాన్ (Shui Hu Chuan) రచయిత అయిన షి నాయ్ అన్ (Shi Nai An) శిష్యుడని, అతనితో కలిసే సాన్కుఓను (San Kuo) తిరగ రాసేడని అంటారు. బేకన్ - షేక్స్పియర్ తగాదాలా ఈ చైనావారి తగాదా కూడా ఎప్పటికీ తెగదు, ముడిపడదు. లోకువాన్ ఛుంగ్ (Lo Kuav Chung) యువాన్ వంశ పాలన కాలపు ఆఖరు రోజుల్లో పుట్టి మింగ్ వంశ పాలనలో కూడా జీవించేడు. ఎన్నో నాటకాలు రాసినా నవలారచయితగానే అతడు ప్రసిద్ధుడు. ఆయన నవలలలో సాన్కుఓ (San Kuo) శ్రేష్ఠమైనది. చైనాలో ఇప్పుడు అంతటా ప్రచారంలో ఉన్న ప్రతి కాంగ్ హ్సి (K'ang Hsi) కాలంలో మావో ఛెన్కాన్ (Mao Chen Kan) చేత సంస్కరింపబడింది. అతడు దాని మీద విమర్శ కూడా రాసేడు. అతడు దానిలో మార్పులు, చేర్పులు, తొలగింపులు కూడా చేసేడు. శైలిని కూడా మార్చేడు. షుఇ హు చువాన్ (Shui Hu Chuan) ఒక నవలగా చైనా వారి స్వాతంత్ర్య పోరాటంలో ప్రాధాన్యాన్ని సంతరించుకుంటే సాన్ కు ఓ (San Kuo) మన పాశ్చాత్య యుద్ధతంత్రం కంటె భిన్నమైన దేశీయమైన యుద్ధ తంత్రకళను వివరంగా అందించడంతో ఒక ప్రాముఖ్యాన్ని సంతరించుకుంది. చైనాలో వ్యవసాయదారులకు సాన్కు ఓ (San Kuo) కంఠస్థం. సేతువులోను సుదీర్ఘ నిదాఘవేళల్లోను తీరిక వేళల్లో తమ కథకులు వర్ణించి వినిపించిన మూడు రాజ్యాల యుద్ధవీరుల పోరాట పద్ధతులనన్నింటిని ఆ నిరక్షరాస్యులు ఒంట బట్టించుకున్నారు. వాళ్లే గెరిల్లా దళాలుగా ఏర్పడి జపాను మీద స్వేచ్ఛా పోరాటాన్ని సాగించేరు. ఆ పాత మెలకువలనే నేటి గెరిల్లాలు నమ్ముకున్నారు. దాడి చెయ్యడం వెనక్కి తగ్గడం - శత్రువు ముందుకొస్తే వెనక్కి తగ్గడం - శత్రువు వెనక్కి తగ్గితే దాడి చెయ్యడం ఇవన్నీ చైనాలోని అన్ని వయసుల వారికి ఆ నవల నేర్పింది.

చైనా ప్రఖ్యాత నవలాత్రయంలో హుంగ్ లో మెంగ్ (Hung Low Meng) లేదా 'ఎర్రగది కల' చివరిది; అత్యాధునికమైనది. ఇది త్సావో హ్స్యూఛింగ్ (Ts'ao Hsueh Ching) ఆత్మచరిత్రాత్మక నవల. మంచు వంశ పాలనలో ఈ రచయిత పెద్ద అధికారి. పాలకులితడిని తమలో ఒకనిగా చూసుకునేవారు. వారి ఎనిమిది సైన్య విభాగాలన్నింటితో రచయితకు సంబంధముండేది. అతడా నవలను పూర్తి చేయలేదు. బహుశా కాఓ (Kao O) దానిని పూర్తి చేసి ఉంటాడంటారు. పూర్వం యువాన్మెయ్ (Yuan Mei), ఆధునిక కాలంలో హుషిహ్ (Hu Shih) ఈనవల ఆత్మచరిత్రాత్మకమైనదనే వాదాన్ని విస్తరించేరు. అదలా ఉంచితే దీని అసలు పేరు షిటౌఛి (Shih Touchi). ఇదా

పాశ్చాత్య శకంలో 1765లో పెకింగ్‌లో వెలువడింది. ఐదారేళ్ల స్వల్ప సమయంలో ఇది చైనా అంతటా ప్రసిద్ధమయింది. అప్పటికింకా ప్రచురణ ఖరీదుగా వుంది. 'నువ్వునాకో పుస్తక మిస్తే నేను నీకొక పుస్తక మిస్తాను' అనే పద్ధతిలో ఈ పుస్తకం అందరికీ తెలిసింది.

ఇతివృత్త పరంగా ఇందులోని కథ సరళమైనదే. కాని అవ్యక్త రూపాల్యాలు, పాత్ర చిత్రణ, మానవోద్రేకాల పోషణలతో అది సంక్లిష్టమయింది. ఇదొక రోగ నిర్ణయాధ్యయనం వంటిది. ఉన్నత వంశానికి చెందిన కథ. రాజవంశీకులకు ఆదరపాత్రమైన సంపన్నవంశకథ అందులో ఒక పాత్ర రాజవంశీకుల ఉంపుడుకత్తె. కాని పుస్తక ప్రారంభ కాలానికే అదంతా గత వైభవ మయింది. ఆ వంశం పతనోన్ముఖ మయింది. ఆ వంశంలో ఛి యా పా ఓ యూ (Chia Paoyu) అనే ఏకైకపుత్రుడు ఆఖరుగా పుట్టేడు. నోట్లో గరుడ పచ్చతో పుట్టిన ఆ బాలుడు అసాధారణుడని అనుకున్నారు. అయినా తన ఇంట్లో నిండివున్న పతన లక్షణాల ప్రభావానికి లోనై అతడు అవినీతిపరుడయ్యాడు. ఆ వంశ సంపద అంతా నశించి పోయింది. ఆ నవల ''స్వర్గం ఒకసారి బ్రద్దలయింది. అది పగిలినప్పుడు అందులో ఒక ముక్క నిరుపయోగం పడివుంది. అదే ప్రసిద్ధమైన ఛి యాపోఓయు (Chia Pao Yu) నోట్లోని గరుడ పచ్చ అయింది' అనే ముందు మాటల్తో ఆరంభమయింది. అందుకే చైనా ప్రజలకు మానవాతీత శక్తుల మీద నమ్మకం నిలిచిపోయింది. ఇప్పటికీ చైనా జీవితంలో అది నిలిచివుంది.

సొంత సాంసారిక సమస్యలు, ఇంట్లో ఆడవాళ్ల నిరంకుశాధికారం, మాతృస్వామ్య వ్యవస్థలోని అలవి మీరిన అధికారం, అమ్మమ్మ- అమ్మ- ఆఖరికి పనిమనుషుల చలాయింపు, ఇంటి యువకుల చేతుల్లో నలిగి తాము నాశనమై వారిని నాశనం చేసే దిక్కుమాలిన అందెగత్తెలు - ఇవన్నీ నిండి వున్న కారణంగా ఆ నవల చైనా ప్రజల ప్రాణ స్పందనగా నిలిచింది. చైనావారి ఇళ్లలో ఆడవాళ్లే తిరుగులేని పరిపాలకులు. వాళ్లు కూపస్థ మండూకాలు. నిరక్షర కుక్షులు. అందుచేత వాళ్ళ పాలన అందర్నీ గాయపరచేది. వాళ్ళు మగపిల్లలను ఉంచుకునేవారు. కసుగందకుండా కాపాడే వారు. అలా సంరంక్షించవలసిన అవసరం లేనప్పుడు కూడా గింజుకులాడేవారు. చియాపాఓయు (Chia pao Yu) అలాంటి వాళ్లలో ఒకడు. హుంగ్‌లో మెంగ్ (Hung Low Meng) దురంతగతిలో మనం అతని ననుసరిస్తాము.

చక్రవర్తులనుండి సామాన్య ప్రజల వరకు విస్తృతంగా ప్రభావితం చేసిన ఈ నవలలోని గూఢ వస్తువును గూర్చి పండితులు వివరించినంత దూరంగా నేను మీకు చెప్పలేను. వారందరూ దీనిని తమలో తాము రహస్యంగా చదువుకుంటారనడంలో నాకు సందేహం లేదు. పండితులు రహస్యంగా నవలలు చదువుతూ, బయటకు వాటిని గూర్చి ఎన్నడూ విననట్లుగా ప్రవర్తించే తీరును గూర్చి చైనాలో ఎన్నో చతురులు వ్యాప్తిలో ఉన్నాయి. ఏది ఎలా ఉన్నా చైనా పండితులు హుంగ్ లో మెంగ్ (Hung Low Meng) నవల కాదనీ, రాజకీయ గూఢ వస్తుమయ కావ్యమని నిరూపించే విమర్శగ్రంథాలు రాసేరు. మంచు వంశపరిపాలకుల విదేశీ పరిపాలనలో చైనా పతనం కావడం అందులోని విషయమన్నారు. శీర్షికలో 'ఎరుపు' అనే పదం 'మంచు' వంశానికి సంకేత మన్నారు. పాఓయు (Pao Yu) కిచ్చి పెళ్ళి చెయ్యడానికి నిశ్చయించబడి మరణించిన లింగ్ తాయ్ యు (Ling Tai Yu) అనే యువతి చైనాకి సంకేతమన్నారు. ఆమె ప్రత్యర్థిగా రాణించి, ఆమెకు బదులుగా గరుడ పచ్చను సాధించిన పా ఓత్సాయ్ (Pao Ts'ai) విదేశీయునికి సంకేతమన్నారు. ఇలా కొనసాగింది వారి విమర్శ. వారి విమర్శ ప్రకారం చైనా అన్నే పదమే తప్పిదానికి సంకేతం. నిజానికిదంతా ఒక ద్రావిడ ప్రాణాయామం

వంటిది. ఒక నవలను నవలగానే చూడాలి. వాస్తవికతను భావుకతను చైనా ప్రత్యేక తరహా లక్షణాలతో కలగలిపి, గర్వకారణమై శక్తివంతమైన గొప్ప ఇంటి పతనాన్ని అత్యద్భుతంగా ప్రదర్శించిన నవల అది. ఒక కప్పుకింద బతకడానికి అలవాటు పడ్డ, తరతరాల, క్రిక్కిరిసిన స్త్రీ పురుషుల అంతరంగ జీవిత చిత్రణ ఆ నవలో కనిపిస్తుంది.

ఈ మూడు నవలల గురించి ఇంతగా నొక్కి చెప్పడంతో చైనావాళ్లు ఏం చేస్తారో నేనూ ఇంచుమించుగా అదే చేసేను. ఎవరైనా 'నవల' అనగా సగటు చైన వారు ''షుఇ హు (Shu Hu) సాన్ కో (San Kuo), హంగ్ లొ మెంగ్ (Hung Low Meng)" అని తడుముకోకుండా బదులు చెప్తారు. అంతలో ఎన్నో వందల ఇతర నవలలు నవలలు కాదని చెప్పడం కాదు, అవీ ఉన్నాయి. ఈ మూడు నవలల తర్వాత అత్యంత ప్రసిద్ధి పొందిన హ్సి యు ఛి (Hsi Yu Chi) లేదా 'పశ్చిమ దేశ యాత్రా ప్రబంధం' అనే నవలను గూర్చి నేను చెప్పక తప్పదు. ఫెంగ్ షెన్ చువాన్ (Feng Shen Chuan) అనే దేవునిగా ఆరాధింపబడిన యుద్ధ వీరుని గాథను గూర్చి చెప్పాల్సి వుంది. మింగ్ వంశ పాలన కాలంలో రాయబడిన ఆ నవలకు రచయిత ఎవరో తెలయదు. రు లింగ్ వై షి (Ru Ling Wai Shi) అనే నవల గురించి చెప్పక తప్పదు. త్సింగ్ (TS'ing) వంశ పాలకుల పాలనలోని బాధల మీద రాసిన అధిక్షేపరచన అది. విధ్వాంసులను ఆ నవల మరీ ఆటపట్టించింది. బాధకలిగించని ద్వంద్వార్థాలు నిండిన సంభాషణలు, దయనీయమైన హాస్యభరితమైన సన్నివేశ బాహుళ్యం గల నవల అది క్రియా శీలం లేక, ఉపయుక్తమైన దైనందిన వ్యవహారాలలో వెనుకబడి, సూత్రబద్ధంగా బ్రతుకుతూ, మౌలిక ధోరణి లోపించిన పండితుల మీద కురిసిన వేళాకోళపు జల్లు ఈనవల. ఎంతో పెద్దదైన ఈ నవలలో కీలకపాత్ర అన్నది లేదు. లు హ్సున్ (Lu Hsun) అనే ప్రఖ్యాత ఆధునిక చైనారచయిత ఆ నవలలోని పాత్రలనుగూర్చి ''వారంతా దగ్గరగా కుట్టబడిన సిల్కు - సాటిన్ పీలికలు'' అన్నాడు. దారాల్లాంటా సన్నివేశాలెన్నో ఆ పాత్రల నొకదానితో ఒకటి కట్టి పడేసాయి.

యీ షొ పేయ్ యిన్ (Ye Shou Pei Yin) లేదా 'సూర్యునితో మాట్లాడిన వృద్ధ తపస్వి' అనే నవల ఇంకొకటుంది. అధికార పదోన్నతిని పొందలేక నిరుత్సాహపడిన ప్రసిద్ధ రచయిత కియాంగ్ యిన్‌కు చెందిన షియా రచించిన నవల ఇది. ఒక సామ్రాజ్ఞికి, ఆమె పాలనలోని విదుషీమణులకు సంబంధించిన, అంతా ఆడవాళ్లతో నిండిన, ఛింగ్‌హువాయున్ (Ching Hua Yuen) అనే స్వైరకల్పన చైనా గ్రంథాలన్నింటిలోను వింతైనది. ఆడవాళ్లు తెలివితేటల్లో మగవాళ్లకేమీ తీసి పోరని నిరూపించడానికి రాసిన నవల అది. అయినా ఆ నవల చివర ఆడవాళ్లకు మగవాళ్లకు జరిగిన యుద్ధంలో మగవాళ్లే గెలిచి సామ్రాజ్ఞిస్థానాన్ని ఒక చక్రవర్తి ఆక్రమించుకుంటాడు.

చైనా ప్రజలను ఆనందపరచే వందలకొలది నవలలో అతికొద్ది భాగాన్ని గూర్చి మాత్రమే నేను మీకు చెప్పగలను. అయినా నేనీరోజు ఇక్కడ మీతో ఇలా మాట్లాడుతూన్న సంగతి చైనా ప్రజలకు తెలిసివుంటే ''ఆ గొప్ప నవలలు మూడింటిని గూర్చి చెప్పు. మేము నిలిచినా కూలినా షుఇ హు చువన్ (Shui Hu Chuan), సాన్ కుఓ (San Kuo), హంగ్‌లో మెంగ్ (Hung Low Meng) ల వల్లనే'' అంటారు. చైనా ప్రజలు బ్రతుకుతూన్నది - ఇంతవరకు బ్రతికినదీ ఈ నవలలోనే. వాళ్లు పాడిన పాటలన్నీ వీటిలోనే ఉన్నాయి. వాళ్లు నవ్వుకునే సంగతులన్నీ వీటిలోనే ఉన్నాయి. ఆచరణలో వాళ్లు ప్రేమించే పనులన్నీ వీటిలోనే ఉన్నాయి. తరతరాలుగా తమ ఉనికిని ఈ నవలలో దాచుకున్నారు వారు. తమ ఉనికి ఉత్తేజపరుచుకోవడానికి మళ్లీ మళ్లీ ఆ నవలలోకే వారు చేరుకున్నారు. వాటి నుండి

కొత్త పాటలను, నాటకాలను, నవలలను కూర్చుకున్నారు. అందులో కొన్ని మూల రచనలతో సమానమైన పేరు ప్రతిష్ఠలను పొందేయి. షుఇ హు చువన్ **(Shui Hu Chuan)** లోని ఒకే ఒక్క సన్నివేశం ఆధారంగా రచించిన ఛింగ్ పింగ్ మే **(Ching Ping Mei)** అనే భావుకత నిండిన శారీరక ప్రణయగాథ అందుకు ఒక ఉదాహరణ. నవలల చిట్టా మీ ముందు పరచడం కంటె ఈ రోజు నేను చేయదగిన ముఖ్యమైన పని ఒకటుంది. స్వతంత్ర భావపూరితమైన ఒక గొప్ప జాతికి చెందిన ఈ మహోదాత్త భావుకతా వైభవమంతా అది బతికిన కాలంలో, పుట్టిన దేశంలో ఎన్నడూ సాహిత్యమని అనిపించుకోలేక పోయింది. చైనాలో కథను ''హ్సియావో షు ఓ'' **(Hsiao Shuo)** అంటారు. తేలికపాటిది - విలువలేనిది అని ఆ మాట కర్థం. నవలను ''త్సాంగ్ పియెన్ హ్సియావో షు ఓ'' **(Ts'ang P'ien Hsiao Shuo)** అంటారు. కథ కంటె నిడివి కలిగిన తేలికపాటి విలువలేని రచన అని దాని కర్థం. అది నిజంకాదు. చైనా ప్రజలు తమదైన నవలా సాహిత్యాన్ని విద్వాంసుల సాహిత్యం కంటె భిన్నంగా పురోగతికి నడిపించారు. ఈరోజు బ్రతికి వున్న సాహిత్యమదే. రాబోయే సాహిత్యంలో భాగస్వామి కూడా అదే. కళ అనే పేరుతో పిలువబడే సాంప్రదాయిక సాహిత్యమంతా అంతరించి పోయింది. ఆ నవలల కథా ప్రణాళికలన్నీ అసంపూర్ణమైనవి. అందులోని ప్రేమ వ్యామోహాలన్నిటికి తరచుగా పరిష్కారాలుండవు. ఎక్కువమంది నాయికలు సుందరీమణులు కాదు. ఎక్కువమంది నాయకులు జగదేకవీరులు కారు. కథ సాధారణంగా ముగియదు. కొన్ని కొన్నింటిలో అది ఆగుతుంది; హఠాన్మరణంతో అర్థంతరంగా జీవితం ఆగినట్లు ఆగుతుంది.

ఈ నవలా సంప్రదాయపు భూమికలో పుట్టి రచయితగా పెంచబడిన దానిని నేను అందులో సాహిత్య సౌందర్యాన్ని పుణికి పుచ్చుకోవాలని, ఉదాత్త కళాశిఖరాల నధిరోహించాలని నేనెన్నడూ కోరుకోలేదు. చైనా నవల నేర్పిన ఈ పాఠం పాశ్చాత్య నవలా ప్రపంచాన్ని వెలుగులో నింపగలదని నేను నమ్ముతున్నాను. కళోపాసకుల మని చాటుకునేవారి తిరస్కృతి కారణంగా ఏర్పడిన చైనా నవలాకారుల దృక్కోణాన్ని మీకు వివరించేను. విద్వాంసులు కళోపాసకులు కాలేదన్నది నామాట.

కళారూపాలను సృష్టించే సహజాతం కళారూపాలను ఉత్పత్తి చేయడం కంటె భిన్నమైనది. చరమ విశ్లేషణ అనంతరం సూటిగా చెప్పాలంటే సృజనాత్మక సహజాతం ఒక అతీతశక్తి. గాఢమైన ఆధి భౌతిక వ్యాపారం. వ్యక్తిలో అది ఎలా పొటమరిస్తుందో నిర్వచించడానికి సాధ్యంకానిది. జీవావసరాలన్నింటికంటె మించిన ఒకగొప్ప వ్యాపారం. ఒక జీవితకాలంలో సాధించలేని శక్తి. అత్యంత సహజమై అభివ్యక్తి మాధ్యమంలో లలితకళల రూపంలో ఈ శక్తి తనలో విశ్వజీవనాన్ని సృష్టించే సామర్థ్యాన్ని గర్భీకరించుకుని ఉంటుంది. అదనంగా సంక్రమించిన ఈ వింత శక్తి ఒకేసారి వ్యక్తి అంతరింద్రియ - బహిరింద్రియ వ్యాపారాల నన్నింటినీ పదునుపెడుతూ వుంటుంది. అది కేవల బౌద్ధిక వ్యాపారమే కాదు - భౌతిక వ్యాపారం కూడా. అందుకే ఇతర సాధారణ వ్యక్తిలో కంటె సృజనశీలంగల వ్యక్తిలో ఇంద్రియాలు మరీ పదును తేరి ఉంటాయి. ఇంద్రియాలు ముమ్మరంగా తనకందించే చేతనలను అత్యంత స్పృహతో తటిద్వేగంతో గ్రహించగల మేధ అతడిది. పుష్కలమైన వాస్తవికత అతడి మేధలో భావనగా పెల్లుబుకుతుంది. అటువంటి సృజన వ్యాపారం నుండి వ్యక్తి తనను మళ్లించుకోలేడు. భావాలు పూర్తిగా బయటపడినపుడే అతని బరువు దిగుతుంది. ఇదొక అంతర్నిగూఢమైన వ్యాపారం. అతడి ప్రాణ స్పందనలోని ప్రతి అణువును ప్రజ్వలితం చేసే ఈ మహోన్నత క్రియాకలాపం అతని నొక్కణ్ణే కాదు. అతని లో జ్ఞాతంగా అజ్ఞాతంగా నిండివున్న మానవాళి జీవన సర్వస్వాన్ని, కలల లోకాల్ని ఆ భావనా వలయంలో ముంచెత్తుతుంది.

ఈ సృజనాత్మక చర్య నుండి కళ తొలగింప బడుతుంది. కాని అది స్రష్టవలన జరగదు. సృజనాత్మక చర్య కళారూపాలను నిర్ణయించేదికాదు. కళానిర్వచనం సృజన వ్యాపారంలోని ముఖ్య దశలో జరగదు; గౌణ దశలో జరుగుతుంది. నవలాకారుడిగా సృజన వ్యాపారునికి చెందిన ముఖ్యదశలో జన్మమెత్తిన స్రష్ట, తనను తాను గౌణ దశకు నిబద్ధుడయేలా చేసుకుంటే అతడి సృజన వ్యాపారమంతా అర్థ రహిత మౌతుంది. రూపము శైలి - శిల్పము కొత్త పంథా - వంటి నిర్మాణరీతులకు లోబడ్డ స్రష్ట, చిక్కుపడ్డ తెరచాప ముళ్లతో, అదుపుతప్పి తిరిగే చుక్కానితో నడి సముద్రంలో నిలిచిన నావను నడిపే నావికుడిలా, లక్ష్యాన్ని చేరుకోలేడు. ఆ నావ తిరిగి అనుకూల వాతావరణంలో ప్రవేశిస్తే కాని తన తోవ కనుకోలేదు. లోచూపు నిగిడ్చినా, లోకం మీద దృష్టి సారించినా నవలాకారుడికి మానవజీవిత మొక్కటే అనుకూలమైన వాతావరణము. ఆ జీవితాన్ని పుష్కలంగా సృష్టించాడా? లేదా? అన్నదే అతడి రచనకు ప్రధానమైన పరీక్ష. జీవత్సృష్టి చేశాడా లేదా అన్నదే ప్రశ్న. ఆ సంగతి అతడికి చెప్పేదెవరు? జీవశక్తులు నిండిన సామాన్య ప్రజలు తప్ప వేరెవరు చెప్పగలరు? కళ అంటే ఏమిటో, దాని నిర్మాణ మెలాగో, దాని ఉన్నతి ఏదో, దాని శ్రేష్ఠత ఏదో తెలిసే పరిధిలోకి వారి నెన్నడూ చేర్చుకోలేదు. వాళ్ల ఆకలిలో, నిర్వేదంలో, వేడుకల్లో, అన్నింటినీ మించిన కలలో వాళ్లు ఇంకి పోయేరు. వారు మాత్రమే వాస్తవికత అనే ఒకే ఒక పరీక్షతో నవల మీద నిష్పక్షపాతమైన తీర్పు నివ్వగలరు. ఆ పరీక్షకు కళాసూత్రాలు కొలబద్దలు కావు. నవలలోని వాస్తవికతను తామెరిగిన వాస్తవికతను వారు తులనాత్మకంగా పరిశీలిస్తారు.

నవలాకారుడు ఏ మారు మూలో నిశ్చలంగా అందంగా మలిచిన రూపాలతో ఉన్న పాలరాతి విగ్రహాలతో నిండిన శిల్ప ప్రదర్శనశాలను చూసి పరవశించి ఆరాధించవచ్చును. కాని అది అతని స్థానం కాదు. అతడు నడివీధిలో నిలువ వలసిన వాడు. అతడికక్కడే తనివి తీరుతుంది.

ఆ వీధి రణగౌణ ధ్వనులతో నిండి వుంటుంది. అక్కడి స్త్రీ పురుషులు మనోహరాభివ్యక్తులతో మలిచిన శిల్పమూర్తులు కారు. అంద వికారంగా, అస్తవ్యస్తంగా, అసమగ్రంగా వుండే మామూలు మనుష్యులు వాళ్లు. వాళ్లెక్కడి నుండి వచ్చారో తెలియదు; ఎక్కడికి పోతారో తెలియదు. కాని మనుష్యులంటే వాళ్లే. ఎన్ని యుగాలకైనా కళా వేదికల మీద నిలిచిన వారి కంటె వారే ఎన్నదగిన వారు.

చైనా నవలాకారుల లాగే ఈ ప్రజల కోసమే రాయడం నేను నేర్చుకున్నాను. లక్షోపలక్షలుగా ఆ ప్రజలు చదివే పత్రికలలోనే నా కథ లుండాలని కోరుకుంటాను. పిడికెడు మేధావులు చదివే పత్రికల్లో ఉండాలని కోరుకోను. ఎందు చేతనంటే - కథ ప్రజల ఆస్తి. వారి చేతనుల అకలుషమైనవి. వారి ఉద్రేకాలు స్వేచ్ఛనిండినవి. వారిలా ఇంకొకరు కథల మీద తీర్పు చెప్పలేరు. నవలాకారుడు పరిశుద్ధసాహిత్యాన్ని తన లక్ష్యంగా ఎంచుకోకూడదు. ఆ విషయాన్నసలు ఆలోచించనే కూడదు. అతడి వస్తువైన ప్రజలకక్కడ చోటులేదు. అతడొక పూరిపాకలోని కథకుడు. అతడు తన కథల్తో ప్రజల్ని ఆపాకలోని నిట్రాటకు కట్టి పడేస్తాడు. దారిన పోయే విద్వాంసుడ కోసం. అతడు కేకపెట్టవలసిన పనిలేదు. కాని దేవుళ్లను వెతుక్కుంటూ శిఖరాగ్రాలకు తరలిపోయే గ్రామీణుల గుంపులలా వెళ్లేటప్పుడు మాత్రం తన దుందుభులన్నింటినీ తారస్థాయిలో మ్రోగించాలి. ''నేను దేవుళ్ళను గురించే చెప్తాను'' అని వాళ్లకోసం గొంతెత్తి ఘోషించాలి. రైతుల్తో భూమిని గురించి మాట్లాడాలి. ముసలివాళ్లతో శాంతిని గూర్చి మాట్లాడాలి. ముసలమ్మల్తో వాళ్ల పిల్లల్ని గూర్చి మాట్లాడాలి. యువతీ యువకులతో వారి పరస్పరానురాగాన్ని గూర్చి మాట్లాడాలి. సామాన్య జనమంతా సంతోషంగా వినినప్పుడే అతడు తృప్తి పడాలి. ఇది మాత్రమే చైనాలో నేను నేర్చుకున్నాను.

(సమాప్తం)

# పురాణం 'మధురవాణి అవతార' వృత్తాంతం

- మద్దాలి సత్యనారాయణ శర్మ

పురాణం సుబ్రహ్మణ్యశర్మ 'సీతా' వతారం చాలించి 'మధురవాణి అవతారం' ఎత్తటానికి గతం గురించి వ్రాయడం అవసరం అనిపించింది.

ఎందుకంటే ఎప్పుడో ఒకప్పుడు, ఎవరో ఒకరు ఈ విషయం అంతా తమకు తెలిసినట్లు, ఉన్నవీ లేనివీ కల్పించి, వ్రాస్తే అదే యథార్థంగా వ్యాపించే అవకాశం వుంది.

రావిశాస్త్రి 'అల్పజీవి' నవలకు ఆ పేరు పెట్టిన వారిని గురించి ఒక 'అయథార్థం' అట్లాగే ఈ మధ్య వ్యాపించింది.

అట్లా కాకుండా ఉన్నమాట చెప్పటం తెలిసిన వారి కర్తవ్యం కదా.

'మిసిమి' (ఆలపాటి) రవీంద్రనాథ్ 1990లో గాబోలు మా పక్క ఇంట్లోకి అద్దెకు వచ్చారు. ఆంధ్రపత్రిక సంపాదక వర్గంలో పనిచేసిన వాణ్ణని తెలిసి నాతో మాట కలిపారు. పరిచయం పెంపొందింది. మిసిమి నిర్వహణలో సాధక భాదకాల గురించి మాటాడుకోవటం, చర్చించుకోవటం, సంప్రతింపులు వుండేవి. రెండుమూడేండ్లు 'మిసిమి' ఫైనల్ ప్రూఫులు సరిదిద్ది పెట్టాను కూడా.

'మిసిమి' ఎల్లప్పుడూ నవనవోన్మేషంగా మిగతా పత్రికలకు భిన్నంగా వుండాలని రవీంద్రనాథ్ తపన. ఒక రోజు ఆయన మా యింటికి వచ్చేటప్పటికి 1939 నాటి 'ప్రజామిత్ర' లో ప్రచురితమైన డాక్టర్ గోవిందరాజుల వెంకట సుబ్బారావు 'గిరీశం గారి కవితా ప్రసంగాలు' తిరగేస్తున్నాను. ఏమిటని చూసి, 'ఇవి మీ దగ్గర ఉన్నాయా, వీటి గురించి విన్నాను గాని చూడలేదు, 'చదివి ఇస్తాను' అన్నారు. 'దానికేం భాగ్యం, చదివివ్వండి, ఇవి పుస్తక రూపం దాల్చినట్లు లేదు' అన్నాను.

తరవాత రవీంద్రనాథ్ గారికి డాక్టరేట్ పట్టా వచ్చింది.

గోవిందరాజుల సుబ్బారావుదీ, రవీంద్రనాథ్‌దీ ఆంధ్ర నాటక, సాహితీ రంగాలకు అఖండ ఖ్యాతి ఆర్జించి పెట్టిన పుత్రరత్నాలను కన్న తెనాలి పట్నమే. గురజాడ వారి కన్యాశుల్కం నాటకంలో గిరీశం పాత్రను సుబ్బారావు అద్వితీయంగా నటించి అపర గిరీశంగా ఖ్యాతినందారు. వారి సరసన మధురవాణిగా స్థానం నరసింహారావు, రామప్ప పంతులుగా ముదిగొండ లింగమూర్తి నటించిన ఆ నాటక ప్రదర్శనం నభూతో నభవిష్యతి. సుబ్బారావు డాక్టరు, యాక్టరు మాత్రమేకాదు, బాగా చదివిన వాడు. బహు విషయవేత్త. సమకాలీన కవులు, కళాకారులతో కలిసిమెలిసి తిరిగినవాడు, భావుకుడు. తదా ఆయన ఆనాటి కవిత, కవుల గురించి గిరీశం-వెంకటేశంతో సంభాషించినట్లు ఆ ప్రసంగాలు వ్రాశారు.

అవి చదివిన రవీంద్రనాథ్‌కి 'గిరీశం' చేత ప్రస్తుత రాజకీయ సాంఘిక, సంగీత, సాహిత్య, నాటక వ్యవస్థలపై వ్యాఖ్యానాలు వ్రాయిస్తే బాగుంటుందన్న వూహ వచ్చింది. నాతో అన్నారు. వ్రాయగల వారెవరని కూడా అడిగారు.

---

శ్రీ మద్దాలి సత్యనారాయణ శర్మ, హైదరాబాద్, ఆంధ్ర పత్రిక సంపాదక వర్గంలో పనిచేసి రిటైర్ అయ్యారు.

ఆ రోజుల్లోనే పురాణం సుబ్రహ్మణ్య శర్మ మాకు సమీపంలో కట్టుకున్న స్వంత ఇంట్లో వసించటానికి వచ్చారు. ఒకే గూటి పక్షులం కదా కలుస్తూ పలకరించుకుంటూ వుండే వాళ్ళం. 'చౌదరిగారూ' అంటూ ఆయన రవీంద్రనాథ్ ఇంటికి వస్తూ వుండేవారు. వారిరువురి భావాలలో అభిరుచులలో సామ్యం కూడా వుండేది. నాకు కూడా సుబ్రహ్మణ్య శర్మ శక్తి సామర్థ్యాలు కొంచెం తెలుసు. రవీంద్రనాథ్ వూహించిన వ్యాసాలు ఆయనే వ్రాయగలడనిపించి ఆమాట చెప్పాను. సుబ్రహ్మణ్య శర్మ కూడా 'గిరీశం గారి కవితా ప్రసంగాలు' తీసుకొని చదివారు.

ఆ తర్వాత చర్చలలో శర్మ గిరీశం ఏమిటి, అంతకంటే రంజుగా మధురవాణి చేతే పలికిద్దామన్నారు. రవీంద్రనాథ్ భేష్ అన్నారు. మధురవాణి అంటే మరింత గ్లామరు కదా ఎవరెవరిని గురించి వ్రాయాలి అనేది పురాణం ఇష్టానికి వదిలివేశారు.

అదిగో అట్లా అవతరించింది పురాణం మధురవాణి. గురజాడ సృష్టించిన పాత్రకు ఎంతో వైదుష్యం, మరెంతో చాతుర్యం హత్తి ఆంధ్ర సాహితీ ప్రియులను ఆనందాబ్ధిలో ఓలలాడించారు పురాణం సుబ్రహ్మణ్య శర్మ.

పూర్వం శంకర్స్ వీక్లీలో ఇమేజినరీ ఇంటర్వ్యూలు పడేవి. అలాగే మన మిసిమిలో గూడ ఎవరైనా సమర్థవంతులైన వారి చేత ఇమేజినరీ ఇంటర్వ్యూలు రాయించాలనీ, నేను (ప్రస్తుత సంపాదకుడు) డా॥ రవీంద్రనాథ్ ఎప్పుడూ అనుకొంటూ ఉండేవాళ్ళం. అటువంటి సమర్థుని కోసం అన్వేషణ కూడ సాగించాం. ఆ తరవాత సత్యనారాయణ శర్మగారి సూచనతో పురాణం వారిపై ఆ బాధ్యత పడింది. నిజంగా పురాణం వారు ఎంత సమర్థులో ధారావాహికంగా మిసిమిలో ప్రచురితమైన మధురవాణి ఇంటర్వ్యూలు చదివిన వారందరికి తెలిసే ఉంటుంది. ఉత్తరోత్తర దీని మీద ఏ అయథార్థం దొర్లకుండ సత్యనారాయణ శర్మగారు రాయడం సంతోషం.

''రావిశాస్త్రి 'అల్పజీవి' నవలకు ఆ పేరు పెట్టిన వారి గురించి ఒక 'అయథార్థం' అలాగే ఈ మధ్య వ్యాపించింది - అని సత్యనారాయణ శర్మ ఈ వ్యాసం మూడో పేరాలో పేర్కొన్నారు''.

ఈ వ్యాఖ్య నేను (సంపాదకుడు) మిసిమి సెప్టెంబరు 2000 సంచికలో ప్రచురించిన నా వ్యాసం ''రావి శాస్త్రి 'అల్ప జీవి': మనో విశ్లేషణ'' కు సంబంధించింది. అందులో నేను ఇలా రాశాను: ''తన నవలకు రావి శాస్త్రి 'అల్పజీవి' అనే పేరు తానుగా పెట్టలేదు. అది 1953లో ధారావాహికంగా 'భారతి'లో వస్తున్నప్పుడు దాని సంపాదక వర్గ సభ్యుడు కె. సత్యనారాయణ పెట్టిన పేరు. ఈ సంగతి రావిశాస్త్రే తన 'ఆఖర్నోమాట' (అల్పజీవి) లో చెప్పుకొన్నాడు. కాని ఈ నవలాను శీలనం చేసి, డాక్టరేట్ అందుకొన్న గ్రంథంలో ఏమో, భారతి సంపాదక వర్గంలో వి.డి. ప్రసాదరావు ఆ పేరు పెట్టాడంటాడు. ఏది ఏమైనా ఈ నవలకు రావి శాస్త్రి మొదట పెట్టిన పేరు 'అయ్యారే బాబారే' ''.

కె. సత్యనారాయణ శంభు ప్రసాదుకు గుమాస్తాగా ఉన్నాడే తప్ప, సంపాదక వర్గంలో ఎప్పుడూ లేడు. 'అల్పజీవి' పేరు పెట్టింది ప్రసాదరావే అంటాడు 1944 నుంచి 1978 వరకు ఆంధ్రపత్రిక సంపాదక వర్గంలో పనిచేసిన ఈ వ్యాస కర్త. - సంపాదకుడు

# రత్నాలు, వజ్రాలు - సైన్సు చెప్పే వాస్తవం

- సి. వి. సర్వేశ్వర శర్మ

ఉప్పు నీళ్లలో చక్కగా కరుగుతుంది. బొగ్గు ఏ పదార్థంలో కరుగుతుందో చాలా కాలం వరకు తెలియదు. ఫ్రెంచి దేశానికి చెందిన రసాయన శాస్త్రవేత్త 'మోయిసా' కరిగిన ఇనుప ద్రవంలో బొగ్గు కరుగుతుందని గ్రహించాడు.

'మోయిసా' ఇనుప లోహాన్ని నాలుగు వేల డిగ్రీల సెంటీగ్రేడు వరకూ వేడిచేశాడు. దీనిలో నేల బొగ్గు కలిపాడు. మిశ్రమం బాగా తయారయిన తరువాత చల్లని నీటి తొట్టిలో చల్లార్చాడు. మిశ్రమం హఠాత్తుగా చల్లారడం వలన ద్రవం ఉపరితలం ఇనుముగా గడ్డ కట్టింది. దీనివలన గడ్డ లోపల ఉన్న ద్రవం అపరిమితమైన పీడనానికి గురి అయ్యింది. లోపలి ద్రవం కూడా గడ్డ కట్టింది.

'మోయిసా' గడ్డగావున్న ఇనుప ముద్దను మళ్లీ వేడి చేసి కరిగించాడు. ఈ ముద్ద కరగడంతో దాని కడుపు నుండి పదిహేను రత్నాలు వెలువడ్డాయి. ఈ విధంగా తయారయిన రత్నాలు అచ్చం ప్రకృతిలో స్వాభావికంగా దొరకే రత్నాల మాదిరి వున్నాయి.

నవరత్నాలలో రాజుగా పేరుగాంచినది వజ్రం. ఈ వజ్రం మంచి చెడులను నిర్ణయించడం, సాన బెట్టే విధానక్రమం వంటివి వివరించగల శక్తి రత్న పరీక్షకులకే వుంటుంది. సామాన్యులు వజ్రాన్ని చూసినా గుర్తించడం కష్టమే.

**ఉల్కలు - రత్నాలు**

ఆకాశం నుండి నేల మీద పడ్డ కొన్ని ఉల్కలలో రత్నాలు దొరికాయి. చిలీ దేశంలో ఆకాశం నుండి రాలిన ఒక ఉల్క మొత్తం అంతా ఒక రత్నమేనట. పూర్వకాలంలో భూమి మీద పడ్డ ఎన్నో ఉల్కలలో విలువైన ఎన్నో రత్నాలు ఉండేవట అందువల్లనే రత్నాలు స్వర్గం నుండి వస్తాయనే విశ్వాసం ప్రజల్లో ఉండేది.

అగ్ని పర్వతాలు విజృంభించినపుడు 'లావా' భూమిపై దొర్లినపుడు అమితమైన ఉష్ణోగ్రతకు, ఒత్తిడికి బొగ్గు లోనయినపుడు అది వజ్రంగా మారుతుంది.

దక్షిణ ఆఫ్రికాలో ఒక ఊళ్లో నది ఒడ్డున ఆడుకుంటున్న కొంత మంది చిన్న పిల్లలకు అక్కడ దొరకే రాళ్లతో ఆడుకోవడం అలవాటు. ఒక అబ్బాయికి తను ఆడుకునే రాళ్లల్లోని రాయి ఒకటి బాగా నచ్చింది. దానిని ఇంటికి తీసుకువెళ్ళి జాగ్రత్తగా దాచుకున్నాడు.

పొరుగింటి 'నీకర్క్' అనే వ్యక్తి ఈ రాయిని చూశాడు. దానిని పదివేల రూపాయలకు కొన్నాడు. నీకర్క్ నది ఒడ్డున ఆడుకునే పిల్లల దగ్గర గల రాళ్ళలో రత్నాలు వున్నాయని గ్రహించాడు.

---

శ్రీ సి. వి. సర్వేశ్వరశర్మ, అమలాపురం, శ్రీ కోనసీమ భానోజీ రామర్స్ కళాశాలలో భౌతిక విజ్ఞాన శాస్త్ర శాఖలో రీడర్‌గా పనిచేసి రిటైర్ అయినారు.

గొర్రెలు కాచుకునే ఒక అబ్బాయి దగ్గర మెరిసే రాయి ఉందని తెలిసిన 'నీకర్క్' అతనిని కలుసుకుని ఆ రాయిని కొన్నాడు. ఆ రాయి తరువాత ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన 'దక్షిణాఫ్రికా తార'గా గుర్తింపు పొందింది. ఆ రాయి బరువు ఎనభై ఎనమిదిన్నర కేరట్లు.

## వజ్రాలు - రంగులు

వజ్రాలు అనేక రంగులలో ఉంటాయి. తెలుపు, పసుపు, గోధుమ రంగుల్లో విస్తారంగా లభిస్తాయి. పచ్చ, ఎరుపు, నీలం రంగుల వజ్రాలు అరుదుగా లభిస్తాయట. అని ఏ రంగులో వున్నా మచ్చ లేకుండా వున్నప్పుడే విలువ. అది తళుకులీడుతుంది. ప్రపంచ ప్రఖ్యాతి చెందిన వజ్రాలన్నీ మచ్చ లేనివే. ఆభరణాలలో వజ్రాలు పొదిగి ధరించడం వారి ఆర్థిక స్తోమతకు చిహ్నం.

1905, జూన్ 26న దక్షిణాఫ్రికా వజ్రపు గనులలో 5 అంగుళాల అడ్డుకోత కల్గిన 3106 కేరట్లు తూగే వజ్రం దొరికింది. ప్రపంచంలో లభించిన వజ్రాలన్నింటిలోను ఇదే పెద్ద వజ్రం. దీని పేరు 'కులినన్'. ఈ వజ్రం కొంత దోషపూరితమై వుండడంవల్ల దానిని 9 వజ్రాలుగా కోసి సానబట్టారు. ఈ వజ్రం ఇప్పుడు బ్రిటిష్ రాజదండంలో పొదగబడి ఉంది.

వజ్రాలు ఆంధ్రప్రదేశ్‌లో కర్నూలు, శిలాకూటం, కడప జిల్లా, అనంతపురం జిల్లా, లత్తవరం, పెద్దహూటూరు, గంజిగుంట, వజ్రకరూరు, బొడసానిపల్లి, కొంగనపల్లి వద్ద లభించినట్లు ఆధారాలు వున్నాయి.

## ఆకుపచ్చ వజ్రం

వజ్రాన్ని మింగితే అది మనిషిని చంపేస్తుంది. వజ్రాలలో ఆకుపచ్చని వర్ణం గలవి చాలా అరుదుగా ఉంటాయి. వజ్రానికి ఆకుపచ్చ ఛాయ రావడానికి కారణం భూగర్భంలో ఇది 'యురేనియం' మూలకంతో అనేక సంవత్సరాలు కలిసి ఉండడం.

యురేనియం యొక్క రేడియో ధార్మిక శక్తిని ఇది గ్రహించి ఈ విధంగా ఆకుపచ్చఛాయను పొందుతుంది. వజ్రాలలో లేత నీలం రంగు ఉండే వాటిని 'బ్లూజాగర్' అంటారు. వీటికి మార్కెట్లో మంచి గిరాకీ ఉంది.

సానపట్టి పలుకలు దీర్చిన తరువాత వజ్రం నాణ్యతను బట్టి రాయల్, డీలక్స్, ఫైన్, సుప్రీమ్ అనే పేర్లతో పిలుస్తారు.

వజ్రం అంటే డైమండ్, కోరండమ్, బెరీల్, టోపాజ్, క్వార్ట్జ్ ఇంకా ఇతర రకాలయిన రత్నాలన్నీ రసాయనికంగా స్వచ్ఛమైన స్థితిలో ఉంటే రంగేలేనివిగా ఉంటాయి. కాని ఇవన్నీ రకరకాల రంగుల్లో లభ్యమవుతూ ఉంటాయి. దేనికి ఇతమిద్ధంగా ఫలానా రంగుతో వుంటుందని నిర్ధారణగా చెప్పేటట్లు

ఉండదు. కారణం ఏమిటంటే ఇందులో మలినంగా ప్రవేశించిన మూలకం బట్టి దాని రంగు మారిపోతూ ఉంటుంది.

నిజానికి రత్నానికి అందం ఆకర్షణ దాని రంగును బట్టి మరింత పెరుగుతుంది. రంగులేని రాళ్ళు కూడా అందంగానే ఉంటాయి. దానికి ఉదాహరణ వజ్రం. ఈ వజ్రాలు కూడా మలినాల కారణంగా అనేక రంగులలో దర్శనం ఇస్తూ ఉంటాయి.

వజ్రం మెరుస్తూ ఉంటుంది. వజ్రానికి ఈ మెరుపు రావడానికి కారణం దాని వక్రీభవన గుణకం మరియు విక్షేపక సామర్థ్యం. పైగా ఇది కోయబడిన రీతి సానబెట్టిన విధానంపై కూడా ఆధారపడి ఉంటుంది.

## నకిలీ వజ్రాలు

మార్కెట్లో వజ్రాన్ని పోలిన నకిలీ వజ్రాలు వస్తున్నాయి. పారదర్శకంగా ఉండే ఏ స్ఫటికమైనా సరే వజ్రానికి గల దృశాధర్మాలు దాదాపుగా కలిగివుంటే దానిని నకిలీ వజ్రంగా తయారు చేయవచ్చు. కాకపోతే ఆకొత్త పదార్థం యొక్క గట్టితనం, రసాయనిక చురుకుదనం దానిని నకిలీగా వుపయోగించడానికి వీలుకుదురుతుందో లేదో తేలుస్తాయి.

మనకు అమెరికన్ డైమండ్స్‌గా మార్కెట్లో లభిస్తున్న డూప్లికేటు వజ్రాలను డయాజమ్స్, బ్రిలియంట్స్ వంటి పేర్లతో పిలుస్తున్నారు. తొలిసారిగా మార్కెట్లో ప్రవేశించిన ఈ అమెరికన్ వజ్రం జిర్కోనియం మరియు సిలికాన్‌ల యొక్క డబుల్ ఆక్సైడు. జిర్కోనియం ఖనిజానికి సంబంధించిన పెక్కు స్ఫటికాలు గోధుమ రంగులో వుంటాయి. ఎందుకంటే ప్రకృతి పరంగా విడుదలయ్యే వికిరణాలు వీటి నిర్మాణాకృతికి హాని కల్గిస్తూ వుంటాయి.

ఇటువంటి స్ఫటికాలకు ఉష్ణ చికిత్స చేస్తూ ఉంటారు. దానితో వాటికి జరిగిన హాని పోయి ఆ స్ఫటికాలు రంగులేని పారదర్శక పదార్థాలుగా తయారవుతాయి. 18వ శతాబ్దంలో జనం వీటికి నాశిరకం వజ్రాలని ముద్ర వేశారు.

## డూప్లికేటు వజ్రాలు

వజ్రానికి డూప్లికేటుగా కోరండం, స్పైనల్, రుటైల్, ఎట్రియమ్ ఆక్సైడ్, ఎట్రియమ్ అల్యూమినేట్ వంటి స్ఫటికాలు వాడుకలోకి వచ్చాయి. అయితే జనం సులువుగా వీటి బండారం బయట పెట్టేయడంతో ఈ ఇమిటేషన్ వజ్రాలు మార్కెట్లో ఎక్కువ కాలం నిలువ లేక పోయాయి.

1960 ప్రాంతంలో ఆప్టో ఎలక్ట్రానిక్ పనుల కోసం శాస్త్రవేత్తలు కొత్తరకం స్ఫటికాలను తయారు చేయడం జరిగింది. వీటిని మార్కెట్లో మేలురకం వజ్రాలుగా గుర్తించారు. ఇటువంటి ఇమిటేషన్ సరుకుకి క్యూబిక్ జిర్కోనియా రాజుగా చలామణి అవుతోంది.

జిర్కోనియా అంటే జిర్కోనియం ఆక్సైడు. ఇది కనీసం మూడు స్ఫటికాకృతులను ప్రదర్శిస్తుంది. అసలు ఇది మోనోక్లినిక్ లక్షణం కల్గి ఉంటుంది. దీనిని 1100 డిగ్రీల సెల్సియస్‌కు వేడి చేస్తే టెట్రాగనల్‌గా మారుతుంది. 2,370 డిగ్రీల సెల్సియస్‌కు వేడి చేస్తే క్యూబిక్‌గా మారుతుంది. అంటే ఘనాకృతి పొందుతుంది.

దీనికి ఎట్రియమ్ ఆక్సైడ్ కలపడం వలన అది చల్లారి గది ఉష్ణోగ్రతకు వచ్చినా దాని ఘనాకృతి చెడకుండా నిలబడి ఉంటుంది. దీనిని ఎట్రియమ్ స్టెబిలైజ్‌డ్ జిర్కోనియా అంటారు. ఇది చర్యకు దిగదు. బాగా హెచ్చుగా వేడి చేస్తేగాని కరుగదు. అంతేకాకుండా దృశాపరంగా వజ్రానికి ఉండే ధర్మాలు ఎన్నో వున్నాయి.

## అమెరికన్ డైమండ్స్

దీనితో ఒక సమస్య ఉంది. దీనికి ఏ మలినం కలిపినా దాని రంగు మారి పోతుంది. అందుకే దీని క్వాలిటీ, బ్యూటీ, రేటు అనేవి దీని స్వచ్ఛతపై ఆధారపడి ఉంటాయి.

కొంతమంది ఉత్పత్తి దారులు ఎట్రియమ్ ఆక్సైడ్‌కు బదులు హోప్ నియమ్ ఆక్సైడ్‌ను జిర్కోనియంకు కలుపుతారు. మార్కెట్లో వజ్రాలుగా చలామణి అయ్యే నాసిరకం వజ్రాలు చాలా కన్పిస్తాయి. గాడోలినియమ్ గాలియమ్ గార్నెట్, ఏట్రియమ్ అల్యూమినియమ్ గార్నెట్ వంటివి మార్కెట్లో అమెరికన్‌డైమండ్స్‌గా దొరుకుతాయి.

ఈ అమెరికన్ డైమండ్స్ జిర్కోనియాకన్నా చాలా చౌకగా మార్కెట్లో లభిస్తాయి. పేద దేశాలలో వీటికి మంచి గిరాకీ ఉంది. స్ట్రాన్ టియమ్ టిటనేటు కూడా అమెరికన్ డైమండ్‌గా బజారులో ఉంది.

దీనికి వక్రీభవన గుణకం ఇంచుమించు వజ్రం వక్రీభవన గుణకానికి సమానము. విక్షేపణ సామర్థ్యం వజ్రానికి వున్న సామర్థ్యానికి మించి ఉండడంవల్ల దీని మెరుపు వజ్రం మెరుపుకన్నా హెచ్చుగా ఉంటుంది.

మంచి క్వాలిటి గల జిర్కోనియా స్ఫటికాన్ని నగలో బిగించి ఉంచితే ఎంతటి వజ్రాల నిపుణుడైనా పట్టి కొడతాడు. దానిని నకిలీ అని గుర్తించలేడు. వీటికి వక్రీభవన గుణకం వజ్రం వక్రీభవన గుణకం కన్నా భిన్నంగా ఉంటుంది. అందువల్ల వీటిని కోసేటప్పుడు వజ్రం కోసినట్లు కాక వేరే కోణాలు వచ్చేటట్లు కోస్తారు. ఈ స్వల్ప తేడాలను మన కన్ను గుర్తించలేదు.

అయినా వీటి రసాయన ధర్మాలలోని తేడాలవల్ల గుర్తించవచ్చు. వజ్రానికి ఉష్ణవాహకత్వం ఎక్కువ.

# ఇంద్రియాతీత శక్తులు

- ఎన్. ఇన్నయ్య

ఒక మనిషి మరో మనిషి మనస్సులోని ఆలోచనను చెప్పగలగడం ఒక విశేష శక్తిగా పేర్కొంటారు. అమెరికాలో ఒకరుంటారు - ఇండియాలో మరో వ్యక్తివుంటాడు. వారిరువురూ ఫోను సైతం చేసుకోరు. అయినా ఇండియాలో వున్న వ్యక్తి ఒకానొక సమయంలో ఏమి ఆలోచిస్తున్నాడో అదే సమయంలో ఆ విషయాన్ని అమెరికాలో వున్న వ్యక్తి చెబుతాడు. తరువాత పరిశీలించిన వారికి యిది అద్భుతంగా ఇంద్రియాతీత శక్తిగా కనిపిస్తుంది. ఇలాంటి ప్రక్రియకు టెలిపతి (Telepathy) అని పేరు పెట్టారు. మరికొందరు యీ టెలిపతి శక్తి ద్వారా మరో వ్యక్తి యిష్టానికి వ్యతిరేకంగాను పనిచేయించగలడంటారు.

టెలిపతి అనేది సాధ్యమా కాదా అనే చర్చ సాగుతున్నది. కార్ల్ యూంగ్ (Carl Jung) వంటివారు దీనికి శాస్త్రీయ గౌరవాన్ని తెచ్చిపెట్టే ప్రయత్నం చేశారు. జె.బి. రైన్ వంటి వారు డ్యూక్ యూనివర్శిటీలో (అమెరికా) పరిశోధనలు చేసి ఫలితాల కోసం తిప్పలు పడ్డారు. సోవియట్ యూనియన్‌లో పరిశీలన తీవ్రస్థాయిలో జరిపారు. అయినా ఇంతవరకూ శాస్త్రీయ నిర్ధారణకు నిలిచే ప్రయోగం తేల్చలేదు. దూరాన వున్న మనుషుల్ని, వస్తువుల్ని తాకకుండానే ప్రభావితం చేయడం, మనస్సు బలంతో వస్తువుల్ని కదల్చడం, మొదలైన చర్యలు చేయవచ్చునని కొందరు భావించారు. ప్రదర్శనలు చేశారు. ఇలాంటి శక్తికి సైకో కెనిసిస్ (Psycho Kinesis) అని పేరు పెట్టారు. ఇజ్రాయిల్‌కు చెందిన యూరిగెల్లర్ చెంచాలను వంచడం, గాలిలో నుండి వస్తువుల్ని సృష్టించడం చాలా మందిని ఆశ్చర్య పరచింది. అదంతా అతీంద్రియ శక్తిగా గెల్లర్ చాటుకున్నాడు. జోసెఫ్ బి. రైన్ కూడా సైకో కెనిసిస్ పై ప్రయోగాలు చేశాడు. గైగర్ కౌంటర్ పరిశోధనలు జరిపాడు. రేడియో యాక్టివిటి విచ్ఛిన్నత ఆధారంగా ప్రయోగాలు ఎన్నో చూచాడు. ప్రిన్స్‌టన్ యూనివర్శిటీ (అమెరికా) లో రాబర్ట్ జాన్ చాలా ప్రయోగాలు చేశాడు.

ఇంతవరకూ టెలిపతిలోగాని, సైకోకెనిసిస్‌లోగాని శాస్త్రీయ పరిశోధనకు నిలిచేవి కనిపించలేదు.

గుర్రపు పందాలలో ఎవరు గెలుస్తారు, లాటరీ టిక్కెట్టులో దేనికి ప్రథమ గెలుపు దక్కుతుంది అనేవి యీ శక్తుల ద్వారా ఎందుకు చెప్పలేక పోతున్నారనే విమర్శకు సమాధానం రావడం లేదు. అయినా నమ్మకస్తులు మొండిగా వీటిని ప్రచారం చేస్తూనే వున్నారు. టెలిపతి ప్రకారం ఒక వ్యక్తి ఎలాంటి ఆధారాలు లేకుండానే మరో వ్యక్తి మెదడులో ఆలోచనలు గ్రహించగలిగితే, మెదడు ఎలా పనిచేస్తుందో తెలుసుకోవాలి. మనిషి మెదడులో సుమారు పది బిలియన్ల కణాలున్నాయి. వీటి పరస్పర సంబంధాలు జటిలంగా వుంటాయి. ఆలోచనలు, ఉద్వేగాలు, నిర్ణయాలు అన్నీ మెదడులో జనించి, ప్రసరిస్తాయి. ఈ కణాలు న్యూరాన్స్ (Newrones) యాక్జాన్స్ (Axons) కు అతి చేరువుగా వుంటాయి. కణాలిచ్చే సంకేతాలను యాక్జాన్లు క్షణంలో మరోచోటకు చేరుస్తాయి. ఇదంతా విద్యుత్తు రసాయనిక చర్యగా సాగిపోతుంటుంది. న్యూరాన్ల మధ్య సంబంధాలకు అయోన్లు అనే అణువులు ఉపకరిస్తాయి. మెదడులో జరిగే యీ ఆలోచనా ప్రక్రియ మరో మెదడుకు తెలియాలంటే సంకేతాలు ఏదొక విధంగా

శ్రీ ఎన్. ఇన్నయ్య, హైదరాబాద్, ప్రముఖ పాత్రికేయులు

బయట పడాలన్నమాట. టెలిపతి ప్రకారం ఆ సంకేతాలను గ్రహించిన వ్యక్తి, వాటి భావాన్ని బయటపెడతాడు. టెలిపతి ప్రకారం అవతల వ్యక్తి మెదడులో సంకేతాలను ఎలాగో తెలుసుకోవడమేగాక, వాటి అర్థాన్ని విప్పి చెప్పగలగాలి. మెదడులో భిన్న భాగాలు భిన్న పనులు నిర్వహిస్తుండగా, టెలిపతి ప్రకారం వీటిని స్వీకరించడమేగాక, సమన్వయీకరించి, అర్థం చెప్పాలి కూడా ఇది సాధ్యమా?

కొందరు పేరా సైకాలజిస్టులు యీ జటిల సమస్యలోని చిక్కుముడి విప్పడానికి ఒక పరిష్కారం కనుగొన్నారు. మెదడు నుండి సిట్రాన్స్ అనే కణాలు వస్తాయని (psitrons) వీటికి సాంద్రత, శక్తి వుండదనీ అన్నారు. క్వాంటం సిద్ధాంతం చెప్పే న్యూట్రినో (Neutrino) వంటివే సిట్రాన్లు అని సామ్యం చూపారు. కార్ల్ యూంగ్ వంటి సైకాలజిస్టులు యీ విషయంలో కోపు వేసుకున్నారు. సిట్రాన్ల సహాయంతో ఇతర మనస్సులలో జరిగే ప్రక్రియను తెలుసుకుంటున్నారన్నారు.

క్వాంటం ఫిజిక్స్‌లో న్యూట్రినోలు అంచనాలకు, పరిశోధనలకు అందాయి. ఫలితాలు వచ్చాయి.

టెలిపతి చెప్పే సిట్రాన్ల వునికి యింత వరకు నిర్ధారణ కాలేదు. అదే ప్రధానమైన తేడా.

మెదడు పై ఆధునిక శాస్త్రం చేసిన పరిశోధనలు యింకా కొనసాగుతుండగా, యిప్పటి వరకూ తెలిసిన విషయాలు కొన్ని అంశాలను బయట పెట్టాయి.

మెదడు పని చేసే తీరులో నాలుగు విధాలైన తరంగాలను కనుగొన్నారు. వీటిని గ్రహించడానికి ఎలక్ట్రో ఎన్‌సెఫలో గ్రాఫ (EEG) తోడ్పడుతుంది.

ప్రతి సెకండ్‌కూ మెదడులోని వివిధ తరంగ ప్రకంపనాల ప్రసారాలు భిన్న తీరుల్లో వుంటాయి.

మెదడు విశ్రాంతిగా ఉన్నప్పుడు ఆల్ఫా తరంగాలు జనిస్తాయి. **(Alpha rhymes)**

మెదడు చురుకుగా పనిచేస్తుండగా బీటా **(Beta)** తరంగాలు ప్రకంపిస్తాయి.

నిద్రలో మెదడు డెల్టా తరంగాలను విడుదల చేస్తుంది.

గాఢనిద్రలో తీటా **(Theta)** తరంగాలు వస్తాయి.

ఈ తరంగాలన్నీ సెకండుకు ప్రసరించే వేగాలలో మార్పు వుండగా, ఇఇజి పరికరం వాటిని చూపగలుగుతుంది. ఇవన్నీ వైద్య రంగానికి బాగా తోడ్పడ్డాయి. మూర్ఛరోగులకు చికిత్సలో యివి సహకరించాయి.

టెలిపతిలో పనిచేసే తీరు వివరించడానకి యీ పరికరం వాడిన (EEG) వారు, ఫలితాలను సాధించ లేకపోయారు. సందేహవాదుల సమక్షంలో టెలిపతి పని చేయదని మరికొందరు వాదించారు!

టెలిపతి రుజువు పరచడానికి చేసిన ప్రయత్నాలలో భాగంగా ఇంగ్లండ్ ఆర్థర్ కోస్లర్ 1985లో ఎడిన్‌బర్గ్ యూనివర్శిటీలో ఒక కేంద్రం నెలకొల్పారు.

ఎక్కడైనా ఒక విద్యార్థి అనూహ్య ప్రతిభను చూపినప్పుడు అదంతా టెలిపతి వల్లనే అనడం ఆనవాయితీ అయింది. ఎక్కడా టెలిపతి శాస్త్రీయ పరిశోధనకు నిలవలేదు.

సైకో కినిసిస్ వాదులు రేడియో సంకేతాల సామ్యం చూపుతూ, అలాంటి ''ఆలోచనా సంకేతాలు'' దూరానవున్న వస్తువుల పై ప్రభావం చూపుతాయన్నారు. రేడియో సిగ్నల్స్ సమాచారాన్నందిస్తాయి. వాటి వలన వస్తువులు కదలవు, చెంచాలు వంగవు. విద్యుదయస్కాంత రేడియేషన్ వంటిది ఆలోచనా తరంగాలలో వుంటే, అదెక్కడా రుజువుకు నిలబడలేదు. రుజువుకు అతీతమైనదని టెలికినిసిస్ వాదులు అంటే అది వారి మూఢ నమ్మకాన్ని సూచిస్తుంది.

పేరా సైకాలజీ నిపుణుడుగా పేరొందిన జె. బి. రైన్ అమెరికాలోని నార్త్ కరోలైనా రాష్ట్ర డ్యూక్ యూనివర్శిటీలో 1930 నాటికి ఒక శాఖను స్థాపించాడు. శాస్త్రీయ పద్ధతిలో పరిశోధనలు చేసి, పేరా సైకాలజీకి గౌరవాన్ని ఆపాదించే ప్రయత్నంలో ఆయన వేలాది పరిశోధనలు చేశాడు. అందులో పేక ముక్కల వంటి కార్డులను ప్రయోగించి, కార్డులలో ఏముందో ఎటువైపు అవి కనిపిస్తాయో అనే అంశం పరిశీలించాడు. అలాగే చదరంగంలో పావులు కూడా వినియోగించాడు. నాణాలు ఎగరవేస్తే తల, తోక ( బొమ్మ బొరుసు) ఎటుపడతాయో లెక్కలు కట్టాడు.

1934లో లాంగ్‌మూర్ అనే నోబెల్ ప్రైజ్ గ్రహీత వెళ్ళి జె. బి. రైన్ పరిశోధనల్ని శ్రద్ధగా తిలకించాడు. పరిశీలకులు తమను తామే వంచించుకుంటున్నారని, లేని వాటికోసం వెతుకుతున్నారని, అదంతా దయనీయమైన స్థితిగా వున్నదని అన్నాడు. తన అభిప్రాయాల్ని జె. బి. రైన్‌కు చెబితే, అతడు ఆశ్చర్యపడక పోగా, ఇర్వింగ్ లాంగ్ మూర్ అభిప్రాయాల్ని బయటపెట్టమని కోరాడు. తద్వారా తనకు ప్రచారం లభిస్తుందన్నాడు.

జె. బి. రైన్ తన పరిశోధనలలో పాల్గొన్న వారు కొందరు కావాలని తప్పుడు అంచనాలు వేస్తున్నా, వాటిని రైన్ బయట పెట్టకుండా దాచినట్లు లాంగ్ మూర్ కనుగొన్నాడు. తనంటే యిష్టం లేనివారు అలా తప్పుడు అంచనాలు వేశారు గనుక వారి లెక్కల్ని చేర్చలేదని రైన్ అన్నాడు. తప్పుడు అంచనాలు వేస్తున్నారని రైన్‌కు ఎలా తెలుసు? లెక్కల్లో కొన్ని మరీ తక్కువ అంచనాలు చూపడమే.

లాంగ్‌మూర్ అనే సైంటిస్టు పేరా సైకాలజీలో ఆసక్తి కనబరచాడనే ప్రచారం చేశారు తప్ప, అతను ఖండించిన రైన్ పరిశోధనల్ని బయట పెట్టలేదు?

నెవాడ యూనివర్శిటీలో పేరా సైకాలజిస్ట్ డీన్ రాడిన్ పరిశోధనలు చేబట్టి, ఒకానొక వ్యక్తికి చెమట పోసే రీతులలో ఉద్వేగ స్థాయిని కొలవ వచ్చునన్నాడు. కంప్యూటర్ ముందు ఒక వ్యక్తిని కూర్చోబెట్టి కొన్ని గందరగోళ పరచే బొమ్మల వలన ఎలా వూహలు మారతాయో చూడవచ్చునన్నాడు. అంతటితో ఆగక, రానున్న బొమ్మను వ్యక్తి వూహించడం ద్వారా అతడిలో ఉద్వేగాలు మారతాయన్నాడు. కొందరు ముందే ఎలాంటి బొమ్మ రానున్నదో సరిగా చెప్పగలుగుతారన్నాడు.

అమెరికాలో నేషనల్ అకాడమీ ఆఫ్ సైన్స్ 1987లో పేరా సైకాలజీని క్షుణ్ణంగా పరిశీలించి, 130 సంవత్సరాల పరిశోధనలలో ఎలాంటి శాస్త్రీయ నిర్ధారణ జరగలేదని స్పష్టం చేశారు.

న్యూజెర్సీలోని ప్రిన్స్‌టన్ యూనివర్శిటీలో రాబర్ట్ జాన్ పేరా సైకాలజీ పరిశోధనలు చేశారు.

ఒక బల్ల ముందు గైలిన్ **(Guillen)** కూర్చొని, ఒక బొమ్మ కప్పను తన మనోబలంతో తన

దగ్గరకు రప్పించాలని ప్రయత్నించాడు. దూరంగా జరిగినప్పుడు మనోబలం తీవ్రంగా లేనట్లు, సమీపంగా వచ్చినప్పుడు మనోబలంతోనే అది చెంతకు వచ్చినట్లు పేర్కొన్నారు. సైకో కెనిసిస్, వస్తువులపై మనో బలం చూపే విధానానికి యిదొక నిదర్శన అని చూప దలచారు. అలాగే నీళ్ళ పంపులలో నీటి చుక్కలపై మనోబలం గురించి పరిశోధనలు చేశారు. ఈ పరిశోధనలలో పాల్గొనే అసిస్టెంట్లు చాలా సందర్భాలలో తమ ''బాస్'' ల తృప్తి కోసం అనుకూల ఫలితాలు చూపినట్లు బయట పడింది.

లాంగ్ మూర్ సైంటిస్టు యీ పేరా సైకాలజీని పేథ లాజికల్ సైన్స్‌గా చిత్రించారు.

పేరా సైకాలజి ఒక ఫాషన్‌గా అంటువ్యాధిలా వ్యాపించింది. దీనికి సైంటిఫిక్ ముసుగు తొడిగి గౌరవం ఆపాదించాలనే ప్రయత్నంలో కోట్లాది ధనం వెచ్చించి, వృధా ప్రయాసకు గురి అయ్యారు. ఫలితాలు మాత్రం శూన్యం.

## పేరా సైకాలజీ చరిత్ర

తొలుత పేరా సైకాలజీలో అనేకాంశాలు పరిశీలనలోకి స్వీకరించారు. దూరదృష్టి, దూరశ్రవణం, భవిష్యత్తును చెప్పడం, మనోబలంతో వస్తువుల్ని కదలించడం, దయ్యాలు, భూతాలు, ఆత్మలు, పునర్జన్మ, గాలిలో తేలడం, మనోశక్తితో ఇతరుల మనస్సులలో ఆలోచనలు గ్రహించడం యిత్యాదులన్నీ చేర్చారు. ఇలాంటివి అన్ని సమాజాలలో పూర్వకాలం నుండి వున్నాయి. యూరోప్‌లో ఆధ్యాత్మికత పేరిట అధ్యయనాలు బాగా సాగాయి. కొందరు తమ వృత్తులు సైతం వదలి, అదేపనిగా ఇంద్రియాతీతశక్తుల పై దృష్టి సారించారు.

మొట్టమొదటగా 1882లో సైకిక్ పరిశోధనా కేంద్రాన్ని లండన్‌లో ప్రారంభించారు. వీరి పరిధిలో శక్తులు, ఆత్మలు, పూనకాలు, దయ్యాలు, భూతాలు, మనస్సుల మధ్య సంబంధాలు వుండేవి. కేంబ్రిడ్జి తాత్వికుడు హెన్రి సిడ్జిలిక్ యీ సైకిక్ రీసెర్చి సంఘానికి అధిపతిగా వ్యవహరించాడు. అందులో 13 మంది ఆధ్యాత్మిక వాదులు, ఆరుగురు పరిశోధకులు వుండేవారు. పరిశీలన అంతా ఆ ఆరుగురు మాత్రమే చేస్తుండగా ఆధ్యాత్మిక వాదులు ఒక్క రొక్కరే తప్పుకున్నారు. 1887 నాటికి కొందరు సుప్రసిద్ధులు యీ సంఘంలో చేరారు. సర్ ఆలివర్ లాడ్జి, లార్డ్ రాలి, జె.జె. థాంసన్‌లు సైకిక్ రీసెర్చి సంఘంలో ఆసక్తిగా పాల్గొన్నారు. ఆత్మకు శాస్త్రీయ గౌరవం ఆపాదించాలని యీ సంఘం ప్రయత్నించింది. వ్యక్తికి భౌతికేతర అంశం కూడా చాలా ప్రధానం అని వీరు తలచారు. అయితే వీరు, టెలిపతితో బాటు, దృశ్యాలు కనబడడంతో సహా అనేకాంశాలు పరిశీలనలోకి స్వీకరించారు. మనస్సును గ్రహించడం, టెలిపతి శక్తుల గురించి బాగా కేంద్రీకరించారు. అనేక శక్తులు సరైనవేనని వీరు నమ్మారు. సర్ ఆలివర్ లాడ్జి తన కీర్తి శేషుడైన కుమారునితో మాట్లాడినట్లు చెప్పుకున్నాడు.

ఈ సంఘం వారిలో కొందరు ఆత్మల పరిశీలనాంశాలలో మోసాలు జరిగినట్లు ఒప్పుకున్నారు.

చేతులు వాటంతటఅవే రాస్తూ పోవడం ఒక శక్తిగా యీ సంఘం నమ్మింది. అవన్నీ ఆధ్యాత్మిక రంగానికి అంటగట్టారు.

ఇంగ్లండ్‌లో సైకిక్ రీసెర్చి ప్రారంభించిన తరువాత, 1985లో అలాంటి సంఘాన్ని అమెరికా

లోని బోస్టన్‌లోనూ మొదలెట్టారు. సుప్రసిద్ధ సైకాలజిస్టు విలియం జేమ్స్ యిందులో పాల్గొన్నాడు. కాని ఆధ్యాత్మిక శక్తులలో వీరికి పూర్తి నమ్మకం లేక, కొన్ని కలహాలు తలెత్తాయి, సంఘం చీలింది. ఉత్తరోత్తరా సైకాలజిస్టు విలియం మెగ్డోగల్ మరి కొందరు సంఘాన్ని పునరుద్ధరించారు.

సైకిక్ సంఘం కలగాపులగంగా మారడంతో, పేరా సైకాలజీని విడదీసి, శాస్త్రీయ గౌరవం ఆపాదించే నిమిత్తం జోసెఫ్ బాంక్స్ రైన్ ప్రయత్నించాడు.

సైకికల్ రీసెర్చి స్థానే పేరా సైకాలజీని 1930 నుండీ జె.బి. రైన్ ప్రచారంలోకి తెచ్చాడు. పరిశోధనాలయాలలో శాస్త్రీయ పరిశీలన చేసి పేరా సైకాలజీని సైన్స్‌లో భాగంగా చేయాలని రైన్ కృషి చేశాడు. ది జర్నల్ ఆఫ్ పేరా సైకాలజీ అనే పత్రిక ప్రారంభించాడు. అంతకు ముందు జర్నల్ ఆఫ్ సైకికల్ రీసెర్చి పత్రిక ఇంగ్లండు నుండి వెలువడుతూ దయ్యాలు, పూనకాలతో సహా అన్ని అంశాలు ప్రచురించింది.

ప్రపంచ వ్యాప్తంగా పరిశోధకులు పేరా సైకాలజీకి శాస్త్రీయ గౌరవం తెచ్చే ప్రయత్నంలో నిమగ్నులయ్యారు. అమెరికన్ సైంటిఫిక్ సొసైటీలో సభ్యులుగా పేరా సైకాలజీ చేరడం గమనార్హం. పరిశోధనాంశాలు ప్రమాణ పత్రికలో ప్రచురించారు. అయితే పేరా సైకాలజీ 4 ప్రధానాంశాలకే పరిమితమై మిగిలిన వాటిని మూఢ నమ్మకాలుగా తృణీకరించింది. ఇది గ్రహించ వలసిన అంశం.

## టెలిపతి

పేరా సైకాలజీలో అత్యంత ప్రధానాంశంగా టెలిపతి వున్నది. ఏ ఆధారం లేకుండానే ఇతరుల మనస్సులలోని విషయాలు గ్రహించి చెప్పగలగడం యిందులో విశేషం.

దూరదృష్టి రెండో పరిశీలనాంశంగా టెలిపతి స్వీకరించింది. వస్తువులు ఎక్కడ వున్నాయో గ్రహించడం, ఇతరుల రోగాల గురించి తెలుసుకోవడం, ఇందుకుగాను తెలిసిన ఆధారాలేవీ వుండక పోవడం యిందలి ఆశ్చర్యకర అంశం.

భవిష్యత్తును చెప్పడం, ఉపద్రవాలను హెచ్చరించగలగడం మరో అంశం.

మనోబలంతో వస్తువుల్ని కదలించడం, వాటిపై వివిధ రీతులలో ప్రభావాన్ని చూపడాన్ని సైకో కెనిసిస్ అంటారు. పేరా సైకాలజీ దీనిని కూడా తన పరిధిలోకి స్వీకరించింది. అయితే కేవలం మనో శాస్త్రానికో, భౌతిక శాస్త్రాలకో పరిమితం కానందున దీనిని పేరా సైకాలజీ అంటున్నారు. కొంతమేరకు శాస్త్రీయ పరిశోధనను తీసుకొని, మిగిలిన శక్తులు కూడా వున్నాయనడం యీ పేరా సైకాలజీ ప్రత్యేకత . జ్యోతిష్యం, ఎగిరే పళ్ళాలు, స్పటికాల ప్రభావం మొదలైనవి పేరా సైకాలజీ స్వీకరించలేదు.

1957లో పేరా సైకలజీకల్ అసోసియేషన్ తలెత్తి, వార్షిక సమావేశాలు జరుపుతూ, పరిశోధనా ఫలితాలను చర్చిస్తూ పోతున్నది. అవన్నీ వివిధ పేరా సైకాలజి పత్రికలు ప్రచురిస్తున్నాయి.

( ఇంకా వుంది)

# 'మిసిమి' ప్రత్యేక సంచికకు ఆహ్వానం

ప్రపంచ ప్రఖ్యాత నవ్య ఫ్రాయిడియన్, మనో విశ్లేషకుడు ఎరిక్‌ఫ్రామ్ శతజయంతిని ప్రపంచ మేధోలోకం ఈ సంవత్సరం అంతా జరుపుకొంటున్నది. ఫ్రామ్ మార్చి 23, 1900 సంవత్సరంలో ఫ్రాంక్‌ఫర్ట్‌లో యూదు తలిదండ్రులకు జన్మించాడు. ఆయన 18వ యేట యుద్ధం అంతమైంది. కాని అసలు యుద్ధం ఎందుకు వస్తుంది? మూక మానవుని ఈ అహేతుక ప్రవర్తనను అర్థం చేసుకోవడం ఎలా? ఈ ప్రశ్నలు అతనిని వేధించాయి.'సరిగా ఆలోచిస్తే ఇప్పటికి ప్రపంచంలో ఉన్న ఈ అధికారిక ఆదర్శ సిద్ధాంత జాలాలను, ప్రకటనలను ప్రతి ఒక్కడూ శంకించవలసిందే, అనే నిర్ణయానికి నేను వచ్చాను' అన్నాడు ఫ్రామ్.

వ్యక్తి జీవితాన్ని శాసించే నియమాలను, సమాజాన్ని శాసించే నియమాలను అంటే ''సామాజిక అస్తిత్వంలో మనుషులను అర్థం చేసుకోవాలని నా కోరిక. ఫ్రాయిడ్ భావనలలో నిలిచేవి ఏవి? మార్చవలసినవి ఏవి? అలాగే మార్క్స్ సిద్ధాంతాలు - ఈ ఇద్దరి చింతనను చివరకు సంశ్లేషించాను.''

కమ్యూనిస్టు ప్రపంచం విస్మరించిన మార్క్స్ మరో పక్షాన్ని ఆయన "Marx concept of man"లో వెలికి తెచ్చిన మానవ వాద సోషలిస్టు ఎరిక్‌ఫ్రామ్. ఈ గ్రంథం మార్క్స్ తొలి రచనల మీదికి అమెరికన్ల దృష్టిని మరల్చింది.

ఉత్పాదక ప్రేమ **(Productive love)** అనే భావనను ఉపయోగించి స్వీయ-ప్రేమ **(Self love)**, 'పొరుగు ప్రేమ' **(love of one's neighbour)**, తోటి మానవుని ప్రేమ **(love of one's fellowman)** లను విశ్లేషించాడు.

ప్రేమించడాన్ని వడ్రంగం, కుండల తయారీ రీతిగా అభ్యసించాలన్నాడు ఫ్రామ్.

''విజ్ఞాన శాస్త్రం అది నిర్వహించే పనుల అంతిమ ఫలితాలను విస్మరించలేదు. ఇతర శాస్త్రాల ఫలితాలతో వాటిని సంశ్లేషించాలి. శాస్త్రీయ పరిశోధనలు నైతికంగా తటస్థంగా ఉండడానికి వీలు లేదు'' అన్నాడు.

''భావ ఐక్యత లేని ఒక సమాజంలో ప్రేమ, వ్యాపార ఆర్థికత - మారుతున్న విలువలు'' అనే అంశంపై చర్చ జరిగింది. అంతర్జాతీయ ఎరిక్‌ఫ్రామ్ సొసైటీ సెప్టెంబరు - 29 నుంచి అక్టోబరు 1 వరకు జర్మనీలో శత జయంతి ఉత్సవాలను జరుపుకుంది.

అంత విస్తృతంగా - ప్రపంచాన్ని అత్యంతంగా ప్రభావితం చేసిన దాదాపు 25 మానవతా వాద సోషలిస్టు గ్రంథాలను రాసి మానవాళిని మేలు కొలిపిన ఫ్రామ్ జన్మదినాన్ని పురస్కరించుకొని **'మిసిమి' ప్రత్యేక సంచిక** తీసుకురావాలని ప్రయత్నిస్తుంది. ఫ్రామ్‌ను ఔపోశన పట్టిన రచయితలు తమతమ వ్యాసాలను ఫిబ్రవరి పది కల్లా పంపవలసిందిగా అభ్యర్థిస్తున్నాము.

- సంపాదకుడు

MISIMI/మిసిమి RNI Regd.No.45042/90 Telugu Monthly, Hyderabad-500 020. Postal Regd. No.H/SD/191.

